1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF PEN

సంపుటి : 2 సంచిక : 178 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 20 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు
VOLUME : 02 ISSUE : 178 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 20 May 2025 PAGES : 8 PRICE : 3/-

## హైకోర్టు మాజీ న్యాయమూర్తులందరికీ సమాన పెన్షన్ : సుప్రీం



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 19)

కొంతమంది హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులకు తక్కువ పెన్షన్ ఇస్తుండడంపై తాజాగా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఇందులోభాగంగా.. హైకోర్టు మాజీ న్యాయమూర్తులందరికీ పూర్తిస్థాయిలో సమాన పెన్షన్ అందజేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగంలో చేరిన తేదీ, ఇతర విషయాలతో సంబంధం లేకుండా మాజీ న్యాయమూర్తులకు పెన్షన్ ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ న్యాయమూర్తులకు, అన్ని జిల్లాల న్యాయమూర్తులకు పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలు సమానంగా ఉండాలని స్పష్టం చేసింది.న్యాయవ్యవస్థకు ఉన్న స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి, గౌరవాన్ని నిలబెట్టడానికి న్యాయమూర్తుల జీతాల మాదిరిగానే, పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలు కూడా ఒకేరకంగా ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి అభిప్రాయం వ్యక్తంచేశారు. శాశ్వత, అదనపు న్యాయమూర్తుల మధ్య ఎటువంటి తేడాను చూపకూడదని పేర్కొన్నారు. వితంతువులు, ఇతర ఆధారపడిన వారికి గ్రాట్యూటీ, కుటుంబ పెన్షన్ వంటి ప్రయోజనాలు కూడా అందరు న్యాయమూర్తులకు ఒకేరకంగా అందించాలన్నారు.టెర్మినల్ ప్రయోజనాల కోసం పదవీవిరమణ తర్వాత న్యాయమూర్తుల మధ్య ఎటువంటి వివక్ష చూపినా అది ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లు అవుతుందని సీజేఐ పేర్కొన్నారు. అందువల్ల అన్ని హైకోర్టుల న్యాయమూర్తులు.. వారు ఎప్పుడు ప్రవేశించారనే దానితో సంబంధం లేకుండా పూర్తి పెన్షన్ పొందడానికి అర్హులని అన్నారు. ఇకపై అన్ని హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తులకు సంవత్సరానికి రూ. 15 లక్షల పెన్షన్.. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులకు రూ. 13.5 లక్షల పూర్తి పెన్షన్ చెల్లించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# ఎన్ని జన్మలెత్తినా తెలుగుజాతిలోనే పుట్టాలని కోరుకుంటా

**కంఠంనేని రవిశంకర్‌కు చెందిన తెలుగువన్ డిజిటల్ మీడియా వజ్రోత్సవం**
**హాజరైన సీఎం చంద్రబాబు**
**కంఠంనేని రవిశంకర్ పట్టుదల, కృషి అందరికీ ఆదర్శమని వెల్లడి**
**400 ఛానళ్లతో తిరుగులేని శక్తిగా తెలుగు వన్ ఎదిగిందని కితాబు**




(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 19)

ఎకానమీ సృష్టికి చిరునామాగా తెలుగుజాతి ఉంటుందని, నాలెడ్జ్ ఎకానమీ, ఆంట్రప్రెన్యూర్‌లో తెలుగుప్రజలు ముందుండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. ఎన్ని జన్మలైనా తాను తెలుగుజాతిలోనే పుట్టి సేవ చేయాలని కోరుకుంటున్నాని అన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం నాడు కంఠంనేని రవిశంకర్‌కు చెందిన తెలుగువన్ డిజిటల్ మీడియా వజ్రోత్సవంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రసంగించారు.

**రవిశంకర్ పట్టుదల ఆదర్శం**

"తెలుగువన్ డిజిటల్ మీడియా ప్రయాణం 2000 సంవత్సరంలో ప్రారంభమై నేడు 400 ఛానల్స్‌తో ప్రతి దేశంలో ఉంది. -మిగతా 2లో

## ఉగ్రవాదంపై పాక్ అబద్ధాలను బట్టబయలు చేశాం - అమిత్ షా

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 19)

'ఆపరేషన్ సిందూర్' ద్వారా దేశీయంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌లోని వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. అయితే, చైనా నుంచి అరువు తెచ్చుకున్న గగనతల రక్షణ వ్యవస్థలను పాక్ ఉపయోగించలేదన్నారు. అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన.. గతంలో చేసిన సర్జికల్ స్ట్రైక్స్, గగనతల దాడులు కేవలం పీవోకేకు పరిమితమయ్యాయని, ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌లోకి 100కి.మీ మేర చొచ్చుకెళ్లి, ఉగ్రస్థావరాలను నాశనం చేశామన్నారు. దీంతో ఉగ్రవాదంపై దాయాది దేశం చేసిన అబద్ధపు ప్రచారం బహిర్గతం అయ్యిందన్నారు. "పాకిస్థాన్‌లోని అనేక స్థావరాలపై మన వైమానిక దళం కచ్చితమైన దాడులు చేసి తీవ్ర -మిగతా 2లో



## విశాఖ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా...

**హాజరుకాని నేతలపై లోకేశ్ ఆగ్రహం**
**డిప్యూటీ మేయర్ పదవి జనసేనకు కేటాయింపు**
**ఎన్నికకు పూర్తి స్థాయిలో హాజరు కాని టీడీపీ కార్పొరేటర్లు...!**
**చర్యలు తీసుకోవడానికి వెనుకాడవద్దన్న లోకేశ్**



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 19)

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ ఎన్నిక అనూహ్యంగా వాయిదా పడటం అధికార తెలుగుదేశం పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కార్పొరేటర్లు తగినంత సంఖ్యలో హాజరుకాకపోవడమే దీనికి కారణం. ఈ పరిణామంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు జరగాల్సిన జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు మొత్తం 74 మంది సభ్యులకు గాను కేవలం 54 మందే హాజరయ్యారు. ఎన్నిక నిర్వహణకు కనీసం 56 మంది సభ్యుల కోరం అవసరం కాగా, ఇద్దరు సభ్యుల కొరత ఏర్పడింది. దీంతో అధికారులు ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే కౌన్సిల్ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయినప్పటికీ, పలువురు గైర్హాజరు కావడం గమనార్హం.ఈ పరిణామాలపై టీడీపీ అధిష్ఠానం సీరియస్‌గా దృష్టి సారించింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, ఈ ఎన్నికకు గైర్హాజరైన కార్పొరేటర్లకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించినట్లు సమాచారం. కొందరిపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడవద్దని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కీలక సూచనలు చేసినట్లు తెలిసింది.ఈ పరిణామాలపై ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ... జీవీఎంసీలో తమకు కావాల్సినంత సంఖ్యాబలం ఉందని తెలిపారు. "డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో నిర్ణయం తీసుకోవడంలో కొంత ఆలస్యం జరిగిన మాట వాస్తవమే. గత రాత్రి 11 గంటలకు ఆ పదవిని జనసేన పార్టీకి కేటాయించాలని నిర్ణయించాం" అని పల్లా తెలిపారు. టీడీపీలో కూడా ఆ పదవిని ఆశించేవారు ఉన్నారని ఆయన గుర్తుచేశారు. ఎన్నిక వాయిదా పడటానికి సమన్వయ లోపం కూడా -మిగతా 2లో

## పాక్ కు ఆపరేషన్ సిందూర్ వివరాలను లీక్ చేసిన ముఠా గుట్టురట్టు




**పంజాబ్‌లో పాక్ గూఢచర్య నెట్‌వర్క్ భగ్నం**
**ఇద్దరు యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు**
**'ఆపరేషన్ సిందూర్' వివరాలు ఐఎస్ఐకి లీక్**
**సైనిక కదలికలు, వ్యూహాత్మక స్థలాల సమాచారం చేరవేత**
**ఖాతాల్లోకి లక్ష రూపాయలు బదిలీ అయినట్లు గుర్తింపు**

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 19)

దేశ భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్న మరో గూఢచర్య ముఠా గుట్టును పంజాబ్ పోలీసులు రట్టు చేశారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు రహస్యాలు చేరవేసిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా -మిగతా 2లో

## గాజా మొత్తాన్ని స్వాధీనం చేసుకుంటాం

**నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు**

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 19)



గాజా మొత్తాన్ని తమ అధీనంలోకి తీసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ( వెల్లడించారు. ఇజ్రాయెల్- హమాస్ ల మధ్య ఉద్రిక్తతల వేళ గాజాలో మరోసారి దాడుల తీవ్రతను పెంచిన నేపథ్యంలో ప్రధాని నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. దౌత్య కారణాలకు లోబడి గాజాలో క్షామాన్ని నివారించాల్సి అవసరాన్ని తాము గుర్తించామని చెప్పారు. "మా పోరాటం తీవ్రస్థాయిలో ఉంది. మేం పురోగతి సాధిస్తున్నాం. ఆ ప్రాంతం మొత్తాన్ని నియంత్రణలోకి తీసుకుంటాం. ఇందులో వెనక్కి తగ్గేదేలేదు. విజయం సాధించాలంటే.. మనల్ని అడ్డుకోలేరనే విధంగా వ్యవవహరించాలి" అని టెలిగ్రామ్ వేదికగా నెతన్యాహు ఒక వీడియోను పోస్టు చేశారు. మరోసారి ఇజ్రాయెల్ గాజాపై దాడుల తీవ్రతను పెంచింది. శనివారం అర్ధరాత్రి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న పలు నివాసాలు, శిబిరాలపై వైమానిక దాడులు జరిపింది. ఖాన్‌యూనిస్‌లో 29 మంది, ఉత్తర గాజాలో 48 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో 26మంది.. మొత్తంగా 103 మంది మరణించారని స్థానిక ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే దాడులను తీవ్రం చేసినట్లు ఇటీవల నెతన్యాహు వెల్లడించిన సంగతి తెలిసిందే.తాజాగా గాజాలోని రెండో అతి పెద్ద నగరమైన ఖాన్ యూనిస్, సమీప ప్రాంతాలను ఖాళీ చేయాలని స్థానిక ప్రజలకు ఇజ్రాయెల్ మిలిటరీ తాజాగా ఆదేశాలు ఇచ్చింది. వాటిని ప్రమాదకరమైన పోరాట ప్రాంతాలుగా పరిగణిస్తునట్లు పేర్కొంది. మరోవైపు దోహాలో జరుగుతున్న చర్చల్లో హమాస్ బహిష్కరణ అంశాన్ని ఇజ్రాయెల్ తెరపైకి తీసుకొచ్చిందని తెలుస్తోంది. యుద్ధం శాశ్వతంగా ఆగాలంటే గాజా పాలన నుంచి హమాస్ వైదొలగాలని, ఆయుధాలు అప్పగించాలని, ఆ సంస్థ ఉగ్రవాదులంతా ఇతర దేశాలకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ డిమాండ్ చేస్తోంది. అయితే గాజా నుంచి వెళ్లడానికి, ఆయుధాల అప్పగింతకు తాము సిద్ధంగా లేమని హమాస్ చెప్పినట్లు తెలుస్తోంది. ఇటీవల పశ్చిమాసియా పర్యటనకు వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. గాజా గురించి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. గాజాలోని పాలస్తీనియన్లు ఖాళీ చేయాలని గతంలో ప్రతిపాదించిన ట్రంప్.. దానిని అమెరికా నియంత్రణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "గాజా ఫొటోలను చూశాను. అక్కడ ఒక్క భవనమూ లేదు. అన్నీ కుప్పకూలాయి. ఆ శిథిలాల కిందే ప్రజలు ఉంటున్నారు. ఇది అంగీకారయోగ్యం కాదు. గాజాను అమెరికా తీసుకోవాలని అనుకుంటున్నాను. స్వేచ్ఛా మండలంగా దాన్ని మలచాలి. గాజాకు సంబంధించి నాకు మంచి ఆలోచనలు ఉన్నాయి" అని పేర్కొన్నారు.

## విశాఖ డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా దల్లి గోవింద్

**జనసేన కార్పొరేటర్ దల్లి గోవింద్‌ను డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ఖరారు**
**సీల్డ్ కవర్ లో గోవింద్ పేరును పంపిన జనసేన అధిష్ఠానం**

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 19)

విశాఖ డిప్యూటీ మేయర్ అభ్యర్థి పేరును కూటమి ప్రభుత్వం వెల్లడించింది. జనసేన కార్పొరేటర్ దల్లి గోవింద్‌ను డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా కూటమి ఖరారు చేసింది. సీల్డ్ కవర్ లో గోవింద్ పేరును జనసేన అధిష్ఠానం పంపింది. ఇవాళ విశాఖపట్నం మహానగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికలు జరగనున్నాయి. కాగా, వైసీపీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూటమి కార్పొరేటర్లు ఇటీవల అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. శ్రీధర్ అవిశ్వాసం ద్వారా వైదొలగడంతో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చింది.



## పాక్ టార్గెట్‌లో గోల్డెన్ టెంపుల్.. గీత కూడా పడనివ్వని భారత ఆర్మీ

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 19)

ఆపరేషన్ సిందూర్‌ను జీర్ణించుకోలేని పాకిస్థాన్.. మనదేశం మీదకు క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ తర్వాత అక్కసుతో పంజాబ్‌లో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్నిలక్ష్యంగా చేసుకుందని మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు. వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టామని తెలిపారు .

మన ఆపరేషన్ తర్వాత పాక్ దాడులకు పాల్పడుతుందని భారత సైన్యం అంచనా వేసింది. మిలిటరీ టార్గెట్లతో పాటు పౌరులకు చెందిన సదుపాయాలు, మతపరమైన ప్రాంతాలపై రెచ్చగొట్టే చర్యలు ఉండొచ్చని ఊహించింది. "పాక్‌కు ఎలాంటి కచ్చితమైన లక్ష్యాలు లేవని తెలుసు. గోల్డెన్ టెంపుల్‌ను లక్ష్యంగా చేసుకొనే అవకాశాలు -మిగతా 2లో



**మొదటి పేజీ తరువాయి**

# ఎన్ని జన్మలెత్తినా తెలుగుజాతిలోనే పుట్టాలని కోరుకుంటా

రవిశంకర్ మంచి కృషి, పట్టుదలతో ఉన్నారు. నేను విజన్ రూపొందిస్తే దానికి సమానంగా ఆయన కూడా ఛానల్ అభివృద్ధిలో విజన్ రూపొందించుకుని ముందుకెళ్తున్నారు. ఒకప్పుడు ఆకాశవాణి తప్ప ఏమీ ఉండేవి కాదు. తర్వాత వార్తా పత్రికలు వచ్చాయి. తర్వాత సమాజంలోకి ఎలక్ట్రానిక్ మీడియా వచ్చింది. 2003లో అలిపిరిలో నాపై మావోయిస్టులు దాడి చేశారు. అప్పుడు ఒక్క జెమినీ మాత్రమే ఉంది... కానీ ఇప్పుడు అనేకం ఉన్నాయి. రవిశంకర్ లాంటి వ్యక్తులు అనేక ఛానల్స్ తీసుకొచ్చారు. ప్రస్తుతం ఇంట్లోనే కూర్చుని ఛానల్ పెట్టుకునే ఆదాయాన్ని కూడా పొందే అవకాశం వచ్చింది. న్యూస్ పేపర్‌కు సర్క్యులేషన్, శాటిలైట్ ఛానల్‌కు టీఆర్పీ, య్యూటూబ్ ఛానల్‌కు వ్యూస్, సబ్‌స్క్రైబ్స్ ఉంటాయి. తెలుగు వన్ ఛానల్ ఇప్పటి వరకు 55 బిలియన్ వ్యూస్, 120 మిలియన్ల సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. 16 లక్షల వీడియాలను, 15 వందలకు పైగా సినిమాలు ఉన్నాయి. తిరుగులేని శక్తిగా తెలుగువన్ తయారైంది.

కంఠంనేని రవిశంకర్ అమరావతి రాజధానిపైనా సినిమా కూడా తీశారు. నాడు భయపెట్టే పరిస్థితులు ఉన్నా వెనక్కి తగ్గకుండా న్యాయం, ధర్మోం అమరావతికి అన్యాయం జరిగిందని చెప్పి సినిమా తీశారు. సెన్సార్ పేరుతో విడుదల కానివ్వకుండా చేస్తే య్యూటూబ్‌లో వదిలారు. 2000 మంది పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేయించారు. ఆయన సేవా కార్యక్రమాల పట్ల అభినందనలు తెలుపుతున్నాను. తెలుగు వన్ స్ఫూర్తి పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలుపుతున్నాను.

**ఈనాడు చొరవతో ఎన్టీఆర్ 30 రోజుల్లోనే మళ్లీ సీఎం**

నేను అరెస్టైన సమయంలో హైదరాబాద్‌లో మీరు పోరాడిన విధానం నా జీవితంలో మర్చిపోలేను. మనం మంచిపని చేస్తే ప్రజలు మర్చిపోతారు అని అంటుంటారు... కానీ ఏ విధంగా ప్రజలు స్పందిస్తారనేది అరెస్టు సమయంలో చూశాను. ఆగస్టు సంక్షోభం వచ్చినప్పుడు ఎన్టీఆర్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నా సీఎం పదవి నుంచి దించేశారు. ఆ సమయంలో ఈనాడు దినపత్రిక చూపిన చొరవతో 30 రోజుల్లోనే తిరిగి ఎన్టీఆర్ మళ్లీ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. పేదరికాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. పీ4 ద్వారా అత్యున్నత స్థాయిలో ఉన్నవారు కింద స్థాయిలో ఉన్నవారిని దత్తత తీసుకుంటే మనతో సమానంగా పైకి వస్తారు. ఎన్టీఆర్ కూడా సాధారణ కుటుంబంలో పుట్టి అచెంచలమైన ఆత్మవిశ్వాసంతో పైకొచ్చారు. మళ్లీ ఎన్టీఆర్ లాంటి వ్యక్తులు రారు..ఆయనతో పోల్చుకోవాలంటే మళ్లీ ఆయనే జన్మించాలి.

**అగ్రభాగాన తెలుగువారే ఉంటారు**

1995-96లో తెలుగు ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ మాత్రమే ఉండేవి. మన తెలుగువారి భవిష్యత్ మారే పరిస్థితి రావాలంటే ఐటీని అందిపుచ్చుకోవాలని నిర్ణయించుకున్నాను. ఐటీని ప్రమోట్ చేయాలనే హైటెక్ సిటీ నిర్మించా. మన వారికి పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించాం. ఇప్పుడు ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా ఇండియన్స్ ఉంటారు, అందులో అగ్రభాగాన తెలుగువారు ఉన్నారు. హైటెక్ సిటీ నిర్మిస్తుంటే అందరూ నవ్వారు..కానీ తర్వాత దాని ఫలాలు అందుతున్నాయి. ప్రస్తుత సమయంలో కష్టపడాల్సిన అవసరం లేదు...స్మార్ట్‌గా చేయాలి. నాలెడ్జ్ ఎకానమీలో హిస్టారికల్ సమాచారం ఉంది. ఏ రంగం తీసుకున్నా ఇప్పుడు ఏఐ వచ్చింది. రియల్ టైంలో డేటా సేకరించే అవకాశం వచ్చింది. నాడు హైటెక్ సిటీ, ఐటీ గురించి మాట్లాడాను...ఇప్పుడు ఏఐతో క్వాంటమ్ వ్యాలీ అని చెప్తున్నాను. 2047 నాటికి ప్రపంచలో ఇండియన్స్ ముందుంటే అందులో తెలుగువారు అగ్రభాగాన ఉండాలనేది నా నా ఆశయం..ఇది సాధ్యమవుతుంది. భారతీయులతో పోటీ పడేవారు ప్రపంచంలో ఎక్కడా లేరు.

**అమరావతి నిర్మించే అదృష్టం దక్కింది**

క్రియేట్ ఎకానమీలో రెండు సిటీలు రూపొందిస్తున్నారు..ఒకటి ముంబై, రెండోది అమరావతి. అమరావతి క్రియేట్ ఎకానమీకి చిరునామాగా ఉంటుంది. అత్యంత నివాసయోగ్యమైన సిటీగా హైదరాబాద్ అవతరించింది. 1995 నుంచి 2000 వరకు బ్లూ ప్రింట్ రెడీ చేసి ఔటర్ రింగ్ రోడ్, ఎయిర్ పోర్టు, జీనోమ్ వ్యాలీ, గచ్చిబౌలి స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేశాం. మీ అందరి ఆశీర్వాదాలతో నాకు మరో అవకాశం దక్కింది. హైదరాబాద్‌ను అప్పట్లో అభివృద్ధి చేసే అవకాశం కల్పించారు. ఇప్పుడు మరోనగరం అమరావతిని తెలుగుజాతికి అందించే అదృష్టం దక్కింది. భవిష్యత్తులో అమరావతి, హైదరాబాద్ మొదటి, రెండవ స్థానాల్లో ఉంటాయి.

**వ్యక్తిత్వ హననంతో సమాజానికి హాని**

ఏది చేయాలన్నా విశ్వసనీయత అవసంరం. ఎన్జీవో, మీడియాకు విశ్వసనీయత ఉండాలి. స్వాతంత్ర్యోద్యమ సమయంలో పత్రికలు, జర్నలిస్టులు కీలకపాత్ర పోషించారు. కానీ ఇప్పుడు పోటీ ప్రపంచంలో విలువలు పడిపోతున్నాయి. సోషల్ మీడియాతో ఎంత లాభం ఉందో..అంతనష్టం ఉంది. సోషల్ మీడియాను వేదికగా తీసుకని వ్యక్తిత్వ హననం, తప్పుడు సమాచారానికి పాల్పడుతున్నారు. దీనిపై నియంత్రణ అవసరం. ఇళ్లలో ఉండే ఆడబిడ్డల వ్యక్తిత్వాన్ని హననం చేస్తే సమాజానికి హాని కలుగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిష్పక్షపాత మీడియాను ప్రోత్సహించే అంశంపై ఆలోచిస్తాయి. దుర్మార్గపు ఆలోచన చేసే వారిని నియంత్రించాల్సి ఉంది" అని సీఎం చంద్రబాబు అన్నారు.

## పాక్ కు ఆపరేషన్ సిందూర్ వివరాలను లీక్ చేసిన ముఠా గుట్టురట్టు

కలకలం రేపింది.అరెస్టయిన వారిని గురుదాస్‌పూర్‌కు చెందిన సుఖ్‌ప్రీత్ సింగ్, కరణ్‌బీర్ సింగ్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వీరి వయసు 19 నుంచి 20 సంవత్సరాల మధ్య ఉంటుందని వెల్లడించారు. ఈ యువకులు 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన సున్నితమైన వివరాలతో పాటు, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల్లో భారత సైనిక దళాల కదలికలు, ఇతర వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాల సమాచారాన్ని పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐకి చేరవేసినట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు.నిఘా వర్గాల నుంచి అందిన పక్కా సమాచారంతో వీరి మొబైల్ ఫోన్లను తనిఖీ చేయగా, పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్న విషయం స్పష్టమైందని వివరించారు.నిందితుల నుంచి మూడు మొబైల్ ఫోన్లు, ఎనిమిది లైవ్ క్యాట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ యువకుల బ్యాంకు ఖాతాల్లోకి లక్ష రూపాయలు జమ అయినట్లు బోర్డర్ రేంజ్ డీఐజీ సతీందర్ సింగ్ పేర్కొన్నారు.గత 20 రోజులుగా వీరు పాకిస్థాన్‌కు రహస్య సమాచారాన్ని అందిస్తున్నారని తెలిపారు. గురుదాస్‌పూర్ పోలీసులు ఈ గూఢచర్య ముఠాను విజయవంతంగా ఛేదించారని డీఐజీ వెల్లడించారు. పట్టుబడిన యువకులు మాదకద్రవ్యాలకు బానిసలయ్యారని కూడా ఆయన వెల్లడించారు. నిందితులపై అధికారిక రహస్యాల చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## పాక్ టార్గెట్‌లో గోల్డెన్ టెంపుల్.. గీత కూడా పడనివ్వని భారత ఆర్మీ

కనిపించాయి. ముందుగానే ఊహించడంతో దానికి అదనపు రక్షణ కల్పించాం. పూర్తిగా సిద్ధమయ్యాం. మన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్స్.. పాకిస్థాన్ సైన్యం ప్రణాళికలను తిప్పికొట్టారు. మన స్వర్ణ దేవాలయంపై ఒక్క గీత కూడా పడకుండా అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేశారు" అని మేజర్ జనరల్ వెల్లడించారు.

'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత సైన్యం పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ మెరుపు దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు చనిపోయారు. దాంతో వందలాదిగా పాక్ డ్రోన్స్, మిసైల్స్‌ను భారత్‌పై ప్రయోగించింది. మన ఎస్-400, ఆకాశ్ తదితర మన గగనతల రక్షణవ్యవస్థలు అద్భుతరీతిలో వాటిని నేలమట్టం చేశాయి. వాటిని ఎక్కడికక్కడ కూల్చేశాయి. దానికి సంబంధించిన వీడియోను వెస్ట్రన్ కమాండ్ పోస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇక పాక్ డ్రోన్లు, మిస్సైళ్ల శకలాలు చెల్లాచెదురుగా పడిన వీడియోలు పెద్దఎత్తున సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన సంగతి తెలిసిందే.

## విశాఖ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా...

ఒక కారణమని, అందుకే ఈ ఇబ్బంది తలెత్తిందని ఆయన అంగీకరించారు. జీవీఎంసీ కౌన్సిల్‌కు సభ్యులంతా హాజరవుతారని, దీనికి తాను పూర్తి బాధ్యత వహిస్తానని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.రేపు జరగనున్న ఎన్నికకు సభ్యులందరూ హాజరై, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసేలా చూడాలని పార్టీ శ్రేణులకు అధిష్ఠానం నుంచి గట్టి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం విశాఖ రాజకీయాల్లో కొంత అలజడి సృష్టించింది.

## ఉగ్రవాదంపై పాక్ అబద్ధాలను బట్టబయలు చేశాం - అమిత్ షా

నష్టాన్ని కలిగించింది. సరిహద్దు భద్రతపై చరిత్ర రాస్తే.. ఆపరేషన్ సిందూర్ సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది. పాక్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేసేందుకు మనం స్వదేశంగా రూపొందించిన బ్రహ్మోస్‌ను ఉపయోగిస్తే.. చైనా నుంచి అరువు తెచ్చుకున్న దాని గగనతల రక్షణ వ్యవస్థను ఉపయోగించలేదు" అని అమిత్ షా పేర్కొన్నారు. "తమ దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు లేవని ప్రపంచానికి పాకిస్థాన్ చెబుతుండేది. దీనిపై భారత్ తప్పుడు ఫిర్యాదుల చేస్తుందని వాదిస్తుండేది. కానీ, ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను తుదముట్టించి పాక్ వాదనను బట్టబయలు చేశాం" అని కేంద్ర హోంమంత్రి అన్నారు.

## కనిగిరి అభివృద్ధే నా అజెండా

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

మినీ మహానాడుకు పోటెత్తిన తెలుగుతమ్ముళ్ళు









**(షణ్ముఖ వెలుగు, కనిగిరి ఇన్‌ఛార్జి, మే 19)**

కనిగిరి నియోజకవర్గ అభివృద్ధే తన అజెండా అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మినీ మహానాడు సోమవారం కందుకూరు రోడ్డులోని మూలె బాలిరెడ్డి కళ్యాణమండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ వెనుకబడ్డ కనిగిరి ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. 2009లో చేసిన పనులు ప్రజల్లో గుర్తున్నాయన్నారు. ఇప్పుడు కూడా కనిగిరి నియోజకవర్గంలో పది కాలాల పాటు ప్రజలకు శాశ్వతంగా గుర్తుండే పనులను చేయడమే తన ముందున్న లక్ష్యమన్నారు. ఆరేళ్ళుగా బైపాస్ పనులు ఆగిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే హైవే రోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాల, భవన నిర్మాణం కూడా అసంపూర్తిగా ఉందని, రూ.2.13 కోట్లతో టెండర్లు కూడా పిలవడం జరిగిందన్నారు. మోడల్ స్కూల్ రోడ్డు, కందుకూరు రోడ్డులోకి సిసి రోడ్డుగా మార్చడం జరుగుతుందన్నారు. సాగునీటి చెరువులు, మోపాడు రిజర్వాయర్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు తెస్తున్నామన్నారు. గత ఐదేళ్ళ పాలనలో చేసిన అభివృద్ధి ఒక్కటైనా గత పాలకులు చూపించగలా అని ఆయన ప్రశ్నించారు. ఏపి పర్యాటకశాఖ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ టీడీపీ పార్టీ దేశంలోనే మంచి గుర్తింపు పొందిన పార్టీ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో దేశానికే ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, నాయకులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సమావేసంలో డిసిఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఏఎంసి ఛైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ గోపి, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గంలోని ఆరు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల పార్టీ అధ్యక్షుడిగా మూరబోయిన బాబురావు నియామకం

అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, మే 19)**

కొనకనమిట్ల మండల పార్టీ అధ్యక్షుడిగా రెండో పర్యాయం మూరబోయిన బాబురావు యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం మార్కాపురంలో జరిగిన మినీ మహానాడు అనంతరం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కొనకనమిట్ల మండల నాయకులందరి ఏకగ్రీవ అభిప్రాయంతో మూరబోయిన బాబురావుయాదవ్ పేరును ప్రకటించి పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్ళాలని సూచించారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో రెండో పర్యాయం కూడా తనకు పార్టీ అధ్యక్ష పదవి కట్టబెట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని ఎన్నటికీ పోగొట్టుకోనని, పార్టీలోని నాయకులందరినీ కలుపుకుని పోయి పార్టీని మరింత పటిష్ట పరిచేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాటమ రాజు, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, ఇతర మండల నాయకులు, కార్యకర్తలు బాబురావుకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## యర్రగొండపాలెంలో 21న మినీ మహానాడు తెలుగుదేశం పిలుస్తోంది... రా! కదలిరా...

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, మే 19)**

తెలుగువారి ఆరాధ్య దైవం స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి ఉత్సవాల సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో యర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆధ్వర్యంలో జరిగే మినీ మహానాడు కార్యక్రమానికి యర్రగొండపాలెం నియోజకవర్గంలోని 5 మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి విజయవంతం చేయవలసిందిగా కోరారు.

## అర్జీలకు బాధ్యతతో పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ ఆనంద్





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 19)**

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించే అర్జీలకు బాధ్యతతో చూపాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులకు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర్ రావు, డిపివో శ్రీధర్‌రెడ్డి, జడ్పీ సిఇవో విద్యారమ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు.

**ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 385 అర్జీలు**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 385 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 170, మున్సిపల్‌శాఖకు సంబంధించి 30, సర్వేకు 32, పంచాయతీరాజ్‌శాఖకు 23, పోలీసుశాఖకు 49, సివిల్ సప్లయిస్ విభాగానికి సంబంధించి 17 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఒంగోలులో భారీ వర్షం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 19)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఏపీకి శక్తి తుపాను ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు కదులుతోంది. రానున్న రోజుల్లో ఇది తుపానుగా మారి తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. నేటి నుంచి ఒక వారం రోజుల పాటు ఏపీ, తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. 30-50 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నాయి. శక్తి తుఫాను ప్రభావంతో ఒంగోలు నగరంలో కురిసిన వర్షంకు కాలవలు నిండి రోడ్డుపైకి చేరిన వర్షపు నీరు, రోడ్డుపై చేరడం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు నగరంలో పర్యటించి వర్షపు నీరు పోయే విధంగా చర్యలు తీసుకున్నారు.

















షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

## మినీ మహానాడుకు బయలుదేరిన 18వ వార్డు నేతలు




(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 19)

రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మార్కాపురం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ మినీ మహానాడు సోమవారం మార్కాపురంలోని శోభ ఫంక్షన్ హాలులో అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమానికి పొదిలి నగర పంచాయతీ పరిధిలోని కాటూరివారిపాలెం 18వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు కంచర్ల వెంకట రమేష్, కెఎస్ఆర్ ఇన్ఫ్రా ఎం డి దుబాయ్ శ్రీను, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, యువ నాయకులు కాటూరి వంశీ కృష్ణ, చాగంటి వెంకట్రావు, దంతులూరి వెంకట్రావు, కాటూరి హరి ప్రసాద్, తదితరులు వాహనాల్లో తరలివెళ్ళారు.

# టీడీపీ గూటికి కనిగిరి ఎంపిపి ?

## మినీ మహానాడుకు హాజరు అనుచరులతో మంతనాలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 19)

కనిగిరి మండల పరిషత్ అధ్యక్షులు డి ప్రకాశం త్వరలో సైకిల్ ఎక్కనున్నారు. ఇప్పటికే ముఖ్య అనుచరులతో సమావేశాలు నిర్వహించినట్లు సమాచారం. ఇటీవల స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆ సందర్భంగా ఎంపిపి ప్రకాశం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను ప్రశంసలతో ముంచెత్తారు. ఎమ్మెల్యే అంటే ఉగ్రనే అంటూ ఉపన్యాసం దంచారు. దీంతో టీడీపీ కార్యకర్తలు, అర్జీదారులు చప్పట్లు చరిచారు. సోమవారం కనిగిరిలో జరిగిన మినీ మహానాడులో కూడా కనిగిరి ఎంపిపి డి ప్రకాశం కనిపించారు. టిడిపి నాయకులతో కరచాలనం చేస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. మహానాడులో కాని లేక ఆ తర్వాత గాని టీడీపీ తీర్థం పుచ్చుకోవడం ఖాయమని ఆయన ముఖ్య అనుచరులు షణ్ముఖ వెలుగు ప్రతినిధికి తెలిపారు. ఎంపిపి డి ప్రకాశం రెండు సార్లు కనిగిరి ఎంపిపిగా, ఒక సారి జడ్పీటిసిగా ఎన్నికయ్యారు. కనిగిరి నియోజకవర్గంలో బలమైన దళిత నేతగా ఆయన గుర్తింపు తెచ్చుకున్నారు. గత వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అయితే కనిగిరి అభ్యర్థి మారడం, ఎంపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఇతర నాయకులు ఒత్తిడి తేవడంతో ఎంపిపి ఎన్నికల సమయంలో వైసీపీలోనే కొనసాగారు. కానీ నియోజకవర్గంలో వైసీపీ తరుపున ప్రచారం చేస్తూనే టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర ఎమ్మెల్యే అయినట్లేనని టీడీపీ నాయకులు, ఆయన ముఖ్య అనుచరులతో బహిరంగంగా చర్చించడం అప్పట్లో జరిగింది. వైసీపీ పై ఆయనకు అభిమానం ఉన్నా సరైన నాయకత్వం లేదనే తీవ్ర అసంతృప్తితో కొన్ని నెలలుగా రగిలిపోతున్నారు. 2009లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్ర గెలిచినప్పుడు ఆయన గెలుపు కోసం అప్పట్లో అహర్నిశలు పని చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, ఎంపిపి ప్రకాశంలు ఇద్దరూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు కావడంతో వారిద్దరి మధ్య రాజకీయ సంబంధాలే ఎక్కువగా ఉన్నాయి. కనిగిరి మాజీ ఎంపిపి పోతు కొండారెడ్డి ఎన్నికల సమయంలోనే టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. ఆయన ప్రస్తుతం ఎమ్మెల్యేతోనే కొనసాగుతున్నారు. ప్రకాశం, పోతు కొండారెడ్డిలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కి పని చేస్తే వైసీపీకి కష్టకాలమనే చర్చ కనిగిరిలో సాగుతోంది. ఎంపిపి ప్రకాశం, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో పార్టీలో చేరేందుకు సుముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. ఎంపిపి ప్రకాశం టీడీపీలో చేరితే చాకిరాల, ఎన్ గొల్లపల్లి పంచాయతీలు టీడీపీ కంచుకోట కానున్నాయి. కనిగిరి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రకాశం ప్రభావం స్పష్టం కనిపించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

# భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 19)

జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిస్థితిని నిరంతరం గమనిస్తూ ప్రజలకు అవసరమైన సహాయం చేసేందుకు జిల్లా స్తాయిలో ప్రకాశం భవనంలో 1077 టోల్ ఫ్రీ నెంబరుతో ప్రత్యేక కంట్రోలు రూమును జిల్లా కలెక్టరు ఎ.తమీమ్ అన్సరియా ఏర్పాటు చేశారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం నుంచి 23వ తేదీ వరకు ఈ కేంద్రం నిరంతరాయంగా పనిచేస్తుంది. ఇందుకోసం రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధక, వైద్య సిబ్బందిని ప్రత్యేకంగా కలెక్టరు కేటాయించారు. ప్రతి 12 గంటలకు ఒక టీము పనిచేసేలా రెండు బృందాలను ఆయా శాఖల సిబ్బందితో ఏర్పాటు చేశారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, భారత వాతావరణ శాఖలు చేసిన ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పర్యవేక్షించేందుకు ఈ కంట్రోల్ రూమును ఏర్పాటు చేసినట్లు కలెక్టరు తెలిపారు. ఈ టోల్ ఫ్రీ నెంబరుకు వచ్చే ఫోన్ కాల్స్ ను రిసీవ్ చేసుకుని ఆ వివరాలను సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి సమన్వయంతో తక్షణమే స్పందించేలా ఇందులోని సిబ్బంది పని చేయాలని కలెక్టరు ఆదేశాలు జారీ చేసారు. వర్షాల కారణంగా మండల, డివిజన్ స్థాయి అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టరు నిర్దేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, మండల, డివిజన్‌ల స్తాయిలోను కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలని చెప్పారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు.

# టీడీపీకి కార్యకర్తలే బలమైన పునాదులు



## కార్యకర్తల త్యాగాలు వెలకట్టలేనివి
## జగన్ చేసిన అప్పులు తీరుస్తూ....
## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నాం
## ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం
## వైసీపీ, బ్లూ మీడియా అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మొద్దు
## కొండపి నియోజకవర్గంలో రూ.450 కోట్లతో తాగునీటి పథకానికి ప్రతిపాదనలు
## మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
## కొండపిలో కోలాహలంగా పండుగ వాతావరణంలో టీడీపీ మినీ మహానాడు



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 19)

టీడీపీకి కార్యకర్తలే బలమైన పునాదులని, కార్యకర్తల త్యాగాలు వెలకట్టలేనివని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం కొండపిలోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో కొండపి నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి (తరువాయి 4లో...)




# ప్రభుత్వ పనితీరు సంతృప్తి పడేలా దృష్టి సారించాలి

## కలెక్టర్‌లకు సూచించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 19)

అన్నీ ప్రభుత్వ శాఖలలో ప్రభుత్వ పనితీరు, ప్రజా సేవల పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జిల్లా కలెక్టర్లకు సూచించారు. సోమవారం సాయంత్రం విజయవాడ ఏపీ సచివాలయంలోని సి.ఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వర్చువల్‌గా సమావేశమై స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్, యోగాంధ్ర -2025 క్యాంపెయిన్, కోర్టు సముదాయాలలో మరుగుదొడ్ల నిర్మాణాల పురోగతి, ప్రభుత్వ పథకాలు సేవల ప్రజా స్పందనలు వంటి అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ కింద అమలు చేస్తున్న ప్రాజెక్ట్స్ లలో ఆయా జిల్లాలకు సంబంధించిన సమస్యలను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టులకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూ చేయడం జరుగుతుందన్నారు. ఆయా జిల్లాలకు సంబంధించి ప్రాజెక్టు పనులలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వచ్చే నెల జూన్ 21వ తేదీన జరగబోయే యోగాంధ్ర 2025 క్యాంపెయిన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు యోగ ప్రోటోకాల్స్ పాటించి విజయవంతం చేయాలన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైజాగ్‌లో జరిగే యోగా దినోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో (తరువాయి 4లో...)



# టీడీపీకి కార్యకర్తలే బలమైన పునాదులు





మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. టీడీపీకి కార్యకర్తలే బలమైన పునాదులు, కార్యకర్తల త్యాగాలు వెలకట్టలేనివి. కార్యకర్తల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గంలోని 41మంది టిడిపి కార్యకర్తలపై మోపిన అక్రమ కేసులను ఎత్తివేసాం. గత ముఖ్యమంత్రి జగన్ తన చేతకాని అసమర్ధ పాలనతో రాష్ట్రాన్ని అప్పుల ఉబిలోకి నెట్టారు. ఓ వైపు జగన్ చేసిన అప్పులు తీరుస్తూ....మరో వైపు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. పింఛను రూ. 4 వేలకు పెంచాం. దీపం గ్యాస్ సిలిండర్లకి ముందుగానే డబ్బులు ఇస్తున్నాం.

అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం జూన్ నెలలో అమలు చేస్తాం, బ్లూ మీడియా అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మొద్దు. గత ఐదేళ్లు పొగాకు రైతులను గాలికొదిలేసిన వైసిపి ప్రభుత్వం నేడు రైతుల్ని రెచ్చగొట్టడం సిగ్గుచేటు. కొండపి నియోజకవర్గంలో ఇప్పటికే రూ.50 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు చేసాం. రామతీర్థం నుంచి కొండపి నియోజకవర్గానికి తాగునీటి పథకం కోసం రూ 450 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నరేగా నిధులతో ప్రతి పంచాయతీలో డొంక రోడ్లు నిర్మిస్తాం. సిసి రోడ్లు మినీ గోకులాల బిల్లులు జూన్ నెల నాటికి చెల్లింపులు చేస్తాం.

పీఎంజేఏవై కింద 70 ఏళ్ళు దాటిన ప్రతి ఒక్కరికి ఐదు లక్షల ఉచిత వైద్య సౌకర్యం కల్పిస్తున్నాం. మన మిత్ర వాట్సాప్ ద్వారా ప్రజలకు సులభంగా సేవలందిస్తున్నామని ప్రజా సంక్షేమ పరమావధిగా ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పనితీరు సంతృప్తి పడేలా దృష్టి సారించాలి



యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యోగా ప్రమోషన్ అండ్ అవేర్నెస్ యాక్టివిటిస్ లో భాగంగా ఈ నెల 21 మే అన్ని జిల్లాల్లో కర్టెన్ రైజన్ కార్యక్రమం నిర్వహించి జిల్లాల్లో ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ యోగా పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి మండలంలో యోగా రిజిస్ట్రేషన్స్ , మాస్టర్ ట్రైనర్లను, అనువైన ప్రాంతాలను గుర్తించించాలన్నారు. మండల స్థాయిలో యోగ పై ర్యాలీలు, రంగోలి, కాంపిటీషన్స్ నిర్వహించాలన్నారు .జిల్లా కలెక్టర్ లు యోగాంధ్ర పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా సబార్డినేట్ కోర్టులలో దెబ్బతిన్న మరియు కొత్త టాయిలెట్స్ కాంప్లెక్సలను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు సేవలపై వచ్చే ప్రజా స్పందనలపై తేలికగా తీసుకోకుండా జిల్లా కలెక్టర్లు సమీక్ష చేసి నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. ఒంగోలు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఒ వెంకటనాయుడు, సిపిఓ వెంకటేశ్వర రావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, డ్వామా, ఐసిడిఎస్, మెప్మా పిడీలు జోసెఫ్ కుమార్, హేన సుజన, శ్రీహరి, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

### చెరుకూరులో వైభవంగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ట







(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 19)

మండలంలోని చెరుకూరు గ్రామంలో సోమవారం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి, శ్రీ పార్వతి దేవి, ధ్వజస్తంభం, పరివార దేవతల విగ్రహా ప్రతిష్ట ఆలయ అర్చకులు గూడా ప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులతో మంత్రోచ్ఛరణ మధ్య ఎంతో వైభవంగా జరిగింది. ప్రతిష్టనంతరం శివపార్వతులకు కళ్యాణం జరిగింది. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. అనంతరం భక్తులు అన్న ప్రసాదాల స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు మండలంలోని వేలాదిమంది చుట్టుపక్కల భక్తులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా మార్కాపురం మహానాడు

## కార్యకర్తలకు అండగా ఉంటా

### పనులు రాలేదని నిరుత్సాహ పడవద్దు

### సమయం ఇంకా ఉంది

### ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తా

### మినీ మహానాడులో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 19)



మార్కాపురం నియోజకవర్గ మహానాడు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం మార్కాపురం పట్టణంలోని శుభం కన్వెన్షన్ హాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు డాక్టర్ నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవలే యుద్ధంలో అసువులు బాసిన భారత సైనికులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు వివిధ అంశాలపై మాట్లాడారు. అనంతరం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వివిధ అంశాలపై కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి వెలుగొండ ప్రాజెక్టు పూర్తయిందని ప్రారంభోత్సవం చేసి శిలాఫలకం వేసి పోయారని, నాలుగు వేల కోట్లు వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి అవసరమౌతుందని, అలా పూర్తి కానీ వెలిగొండ ప్రాజెక్టను పూర్తి అయిందని కలరింగ్ వైసీపీ నాయకులు ఇస్తున్నారన్నారు. దీన్ని మన తెలుగుదేశం నాయకులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. గత వైసిపి ప్రభుత్వం లాగా రూ.3000లు పెన్షన్ చేయడానికి 5 సంవత్సరాలు తీసుకున్న ఘనత గత వైసీపీ నాయకులదని అలాంటి వారు తమ ప్రభుత్వంను విమర్శ చేయడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికే తమ ప్రభుత్వం హామీ ఇచ్చినటువంటి 4వేల రూపాయలు పెన్షన్ ను అమలు చేశామని, నెల ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఎకౌంట్లో వేస్తున్నామని, మూడు సిలిండర్ల హామీని ఇప్పటికే అమలు చేశామని త్వరలోనే తల్లికి వందనం, రైతు భరోసా పథకమును అమలు చేయబోతున్నామని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేస్తామని అన్నారు.గత వైసిపి ప్రభుత్వం తట్ట మట్టి కూడా పోసిన పాపాన పోలేదని గ్రామాల్లో సిసి రోడ్లను తమ ప్రభుత్వ హయాంలో వేస్తున్నామని అన్నారు. కొనకనమిట్ల మండలంలో 500 కోట్ల రూపాయలతో బయోగ్యాస్ ప్లాంటును రిలయన్స్ వారి సహకారంతో త్వరలోనే స్థాపిస్తామని దానికి వారు వేలమంది ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని అన్నారు. తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు గ్రామంలో ఏపీఐఐసీ వారి సహకారంతో ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేస్తున్నామని తద్వారా వందల మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతి ఒక్కటి తప్పకుండా గెలవాలని కోరారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. పనులు రాలేదని ఏ నాయకుడు, కార్యకర్త బాధపడాల్సిన అవసరం లేదన్నారు. ఇంకా సమయం చాలా ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే బాధ్యత తనది అని స్పష్టం చేశారు. ఈ మహానాడు కార్యక్రమంలో మార్కాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకట్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటక సుబ్బా రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు డాక్టర్ మౌలాలి, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు పిన్నిక శివ యాదవ్, మండల అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మస్తాన్, నాలి కొండయ్య యాదవ్, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), జిల్లా ముస్లిం మైనార్టీసెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, పొదిలి, కొనకనమిట్ల మండలపార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, మూరబోయిన బాబురావు యాదవ్, పొదిలి పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, కొనకనమిట్ల మండల పార్టీ మాజీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నాలుగు మండలాలు, మార్కాపురం టౌన్ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# స్థల ఆక్రమణకు జనసేన నాయకుడు విఫల యత్నం

### ఆక్రమణలు అడ్డుకున్న స్థానికులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 19)

కమ్యూనిటీ హాలుకు కేటాయించిన అత్యంత విలువైన ప్రభుత్వ స్థల ఆక్రమణను సోమవారం కార్పొరేషన్ అధికారుల ద్వారా స్థానికులు అడ్డుకున్నారు. వివరాలు లోకి వెళితే నగర పరిధిలోని గతంలో 'పాతసుజాత నగర్ విఐపి రోడ్డు' 1-2 లైన్ల నడుమ ఖాళీ స్థలం(30 గదులు) కార్పొరేషన్ 'కమ్యూనిటీ హాలు' కు కేటాయించింది. సదరు స్థలంలో అధికారులు 'కార్పొరేషన్ కు చెందిన స్థలం' గా బోర్డు కూడా ఏర్పాటు చేసారు. ఈ బోర్డు ఏర్పాటు ఆక్రమణదారుకు కలిసిచ్చిందేమో.. చెరువుకొమ్ముపాలెం కు చెందిన జనసేన నాయకుడు ఒకరు నాలుగు రోజుల క్రితం అక్కడ ఉన్న బోర్డు పీకి వేసి, సోమవారం స్థలంలో 'బోరు' వేసే ప్రయత్నం చేసారు. దీన్ని గమనించిన స్థానికులు ఆక్రమణ అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే ఈ స్థలం తనకు కేటాయించినట్లు, కోర్టు ఉత్తర్వులు ఉన్నట్లు బుకాయించాడు. విషయం తెలుసుకున్న సిపిఎం నగర నాయకులు దామా శ్రీనివాసులు, కమిషనర్ ఎం వెంకటేశ్వరరావుతో పాటు ఇతర అధికారులకు సమాచారం ఇచ్చారు. స్థానిక సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేసారు. సమాచారం అందుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు సంఘటన స్థలాన్ని సందర్శించి స్వాధీనం చేసుకుని తిరిగి ప్రభుత్వ స్థలం గా బోర్డు ఏర్పాటు చేసారు. ఆక్రమణ దారుని కోర్టు పత్రాలు చూపించమని అధికారులు ప్రశ్నించగా ఆ వ్యక్తి అక్కడ నుంచి ఉడాయించాడు.

స్థలాన్ని ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలి

గతంలో ప్రజా వసరాలకు (కమ్యూనిటీ హాలు)కు కేటాయించిన అత్యంత విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణలకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నాయకులు దామా శ్రీనివాసులు డిమాండ్ చేసారు. తక్షణమే ప్రహరీ వంటి రక్షణ కల్పించడం, పార్క్ అభివృద్ధి పరచి వసతులు కల్పించడానికి కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.



# సుందరయ్య ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలి

### 40వ వర్ధంతి సందర్భంగా సిపిఎం నివాళి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 19)

పుచ్చలపల్లి సుందరయ్య ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకం కావాలని సిపిఎం నాయకులు సూచించారు. సోమవారం నాడు సుందరయ్య భవన్‌లో మార్క్సిస్ట్ పార్టీ ఉద్యమ నిర్మాత సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ ఘనంగా నివాళులర్పించింది. ప్రపంచంలో జరిగిన క్యూబా, వియత్నాం విముక్తి పోరాటాలను మించిన తెలంగాణ రైతాంగ సాయుధపోరాటానికి నాయకత్వం వహించిన సుందరయ్య ఉద్యమ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత ఆయన సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా పూనాటి మాట్లాడుతూ స్వాతంత్ర్యఉద్యమ నేపథ్యంలో చేపట్టిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లో కేడర్ ను రక్షించుకోవడం,ఆర్థిక వనరులు సమాకూర్చుకోవడం, కేడర్ కు శిక్షణ వంటి బహుముఖ పనులు నిర్వహించడం లో సుందరయ్య అత్యంత కీలక భూమిక పోషించారని చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన గెరిల్లాపోరాటం 3వేల గ్రామాల్లో స్వయంపాలనకు దారి తీసిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసారు. ఈ ఉద్యమం ద్వారా 3 లక్షల ఎకరాలు భూములు పంపిణీ చేసిన సందర్భాన్ని గుర్తు చేసారు. పార్టీ అంతర్గత ఉద్యమ కాలంలో(1951 - 1964)గ్రామీణ ప్రాంతాల్లో స్వయంగా అధ్యయనం చేసి గ్రామీణ పేదరైతులు, వ్యవసాయ కార్మికుల ఉద్యమంలో కి రావాలని సూచించారని ఈ సందర్భంగా తెలిపారు. సమాకాలీన నూతన ఆర్థిక విధానాలు, పరిస్థితులను అర్ధం చేసుకోవడం, నిర్దిష్ట పరిస్థితులను అనుసరించి ఉద్యమాలను చేపట్టాలన్న సుందరయ్య ఇచ్చిన సూచనలు పాటించినపుడే నిజమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకులు వై సిద్దయ్య మాట్లాడుతూ కులాలు, మతాల పేరుతో మనుషుల మధ్య వైరుద్యాలు సృష్టిస్తున్న మతోన్మాదులను వర్గ చైతన్యంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వర్గ పోరాటం ద్వారానే సమాజ మార్పు చెందుతుందన్న మార్క్సిస్టు, లెనినిస్ట్ సూత్రాలను అమలు చేయడం ద్వారా రుజువు చేసిన సుందరయ్య ఆశయాలను అమలు చేయాలన్నారు. వర్గ చైతన్యం కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ సుందరయ్య ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, బి రఘురామ్, కంకణాల రమాదేవి, పార్టీ నాయకులు గంటెనపల్లి శ్రీనివాసులు, సిహెచ్ వినోద్, కెఎఫ్ బాబు, జి నరసయ్య, కంకణాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే టిడిపికి అండ -సమాజమే దేవాలయం

### ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో స్థాపించిన పార్టీ తెలుగుదేశం

### దేశానికి సంక్షేమం పరిచయం చేసింది అన్న ఎన్టీఆర్

### దేశానికి అభివృద్ధి అంటే ఏంటో చూపించిన నేత సీఎం చంద్రబాబు

### ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 19)**

దేశానికి అభివృద్ధి అంటే ఏంటో చూపించిన నేత మన చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అండ అని, కార్యకర్తలు ఏ స్థాయిలో ఉన్న వారిని విస్మరించేది లేదని , వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. కందుకూరు పట్టణంలోని తిరుమల కళ్యాణ మండపంలో సోమవారం సాయంత్రం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గం స్థాయిలో మినీ మహానాడు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీలో వివిధ కారణాలతో చనిపోయిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రద్ధాంజలి ఘటించారు. ఇటీవల పెహల్గాం ఉగ్రవాదులు దాడులలో చనిపోయిన వారికి, పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో అమరవీరులైన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ టిడిపి పార్టీ ఆవిర్భవించి 43 ఏళ్లు అయిందని, అందులో 23 సంవత్సరాలు అధికారంలో ఉన్నామంటే దాని వెనుక కార్యకర్తల కృషి మరువలేనిదని ఎమ్మెల్యే తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలో తనను ఎమ్మెల్యేగా గెలిపించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి , తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కృషి చేస్తానని అదేవిధంగా 2029 సంవత్సరంలో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేయటమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి లేనివిధంగా కోటి సభ్యత్వాలు తో రికార్డు సృష్టించామన్నారు.. కార్యకర్తల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ ఎప్పుడు కృషి చేస్తుందని, కార్యకర్తల కోసం ప్రమాద బీమా రెండు లక్షల నుంచి ఐదు లక్షల పెంచిన ఘనత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి దక్కుతుందని తెలిపారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అన్న నినాదంతో పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలుగువారి ఆత్మగౌరవం కోసం పోరాడిన వ్యక్తి స్వర్గీయ ఎన్టీఆర్ అని కొనియాడారు.. పార్టీ పెట్టిన తొమ్మిది నెలలోనే అధికారంలోకి వచ్చి తెలుగు వారి సత్తా ఏంటో ఢిల్లీకి చూపించామన్నారు... 43 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో విజయాలు చూసామని ఎన్నో సంక్షోభాలు చూసామని ఎన్ని కష్టాలు వచ్చినా ఎత్తిన జెండా దించకుండా పార్టీకి కాపు కాసింది పార్టీ కార్యకర్తలని ఎమ్మెల్యే తెలిపారు. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది అన్న ఎన్టీఆర్ అని అన్నారు. అదే దేశానికి అభివృద్ధి అంటే ఏంటో చూపించింది రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు అని చెప్పారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తెలిసేలా చేసింది అన్న ఎన్టీఆర్ అయితే , తెలుగువారిని ప్రపంచ పటంలో పెట్టింది పార్టీ అధినేత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముందుగా కందుకూరు నియోజకవర్గంలోని 7 ప్రధాన సమస్యలతో తీర్మానాలను ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదించిన తీర్మానాలను కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఏకగ్రీవంగా ఆమోదించి ఈ నెల 27,28,29 తేదీల్లో కడపలో జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడులో తీర్మానాలను ప్రవేశపెట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు , మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, రాచగర్ల సుబ్బారావు, పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు కంద్రా మాల్యాద్రి, పిడికిడి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు ఉన్నం వీరాస్వామి , చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, చిలకపాటి మధుబాబు, నాదెళ్ల వెంకట రమణయ్య, గొట్టిపాటి హరికృష్ణ, కూనం నరేంద్ర, వడ్డెళ్ళ రవిచంద్ర, ముచ్చు శ్రీనివాసరావు నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, గ్రామ, వార్డు పార్టీ అధ్యక్షుడు మహిళలు ,కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.









# ఎన్డీఏ ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 19)**

ఎన్డిఏ ప్రభుత్వంలో విద్యకు పెద్దపేట వేస్తున్నామని పల్నాడు జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం దుర్గి మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ గిరిజన బాలికల పాఠశాల నందు జూనియర్ కళాశాల అప్ గ్రేడ్ కు అదనపు గదుల నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని, శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దాదాపు రూ.1 కోటి 52 లక్షల నిధులతో నిర్మాణాలు జరగనున్నాయి. అలానే ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహ నిర్మాణానికి రూ.1 కోటి 73 లక్షల నిధులతో ముఖ్య అతిథులు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు ధారు నాయక్, దుర్గి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను నిర్ణీత కాలపరిమితి లోపు విచారణ చేయాలి

### బాధితులకు న్యాయం చేయాలి

### జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ -పోలీసు గ్రీవెన్స్‌కు 70 ఫిర్యాదులు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 19)**

ప్రజా ఫిర్యాదులకు త్వరిత పరిష్కారం చూపుటకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (మీ కోసం) కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ నిర్వహించారు. జిల్లాలో వివిధ గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుండి పిర్యాదుదారులు నేరుగా వచ్చి తమ తమ పిర్యాదులను వ్రాతపూర్వకంగా జిల్లా ఎస్పీకి, పోలీస్ అధికారులకు విన్నవించుకున్నారు. అధికారులు వారితో ముఖాముఖిగా మాట్లాడి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకుని వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. అందిన ఆయా ఫిర్యాదుల గురించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ఆయా ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కారించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నివేదిక కూడా ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కొరకు పోలీసు స్టేషన్లు, కార్యాలయాలకు వచ్చు పిర్యాదుదారులతో పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాదగా వ్యవహరించి చట్ట పరిధిలో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. పోలీసు గ్రీవెన్స్‌కు 70 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేదింపులు, భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్బి డిఎస్పీ సురేష్ బాబు, మహిళా పియస్ డిఎస్పీ రమణ కుమార్, ఎస్సీ,ఎస్టీ సెల్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, డీటీసి ఇన్స్పెక్టర్ షమీముల్లా, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు రజియా సుల్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.





# మూత్రం తాగించిన అగ్రకుల రౌడీ గ్యాంగ్‌ను రాచకంపై అరెస్టు చేయాలి



### దళిత విద్యార్థి జేమ్స్ పై హత్యాయత్నం చేశారు

### హీరో మోహన్‌బాబు ఇంజినీరింగ్ కాలేజీలో

### అగ్రకుల అరాచకంపై హోం మంత్రి స్పందించాలి

### దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 19)**

హీరో మోహన్‌బాబువిద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో బీటెక్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్ పై హత్యాయతనం చేసి మూత్రం తాగించిన అగ్రకుల రౌడీ గ్యాంగ్ ముఠాను అరెస్టు చేయాలని హోం మంత్రి అనిత ఈ అనాగరిక అగ్రకుల ఆటవిక రౌడీయిజంపై విచారణ జరిపించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు నీలం నాగేందర్ రావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయం వద్ద దళిత విద్యార్థి జేమ్స్ పై అగ్రకుల రౌడీ గ్యాంగ్ జరిపిన అమానుష ఘటనపై నిరసన తెలియజేశారు చిత్తూరు జిల్లా హీరో మోహన్ బాబు కి చెందిన విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్న జేమ్స్ అనే దళిత విద్యార్థిపై అదే కాలేజీకి చెందిన కొందరు అగ్రకుల విద్యార్థులు అగ్రకుల అహంకారంతో జేమ్స్‌ని అంబేద్కర్ కులం నా కొడకా అంటూ నానా రకాలుగా అవమానించారు. చాలా కాలంగా సాగుతున్న ఈ కుల అవమానాలని తట్టుకోలేక జేమ్స్ ఎదురు తిరిగాడు అన్నారు . అంతట అగ్రకుల విద్యార్థులు రౌడీ షీటర్ సాయి రూపేష్ , చోటా బ్లడ్ గ్యాంగ్ ముటాచే జేమ్స్‌పై హత్యాయత్నం చేశారన్నారు. అంతేగాక జేమ్స్ మూత్రాన్ని జేమ్స్ చేత తాగించి అమానమీయమైన చర్యకు పాల్పడ్డారన్నారు. ఇంజనీరింగ్ కాలేజీలో దళిత విద్యార్థిపై ఇంత హేయమైన హత్యాయత్నం మూత్రం తాగించడం జరిగిన స్థానిక పోలీసులు సరిగ్గా స్పందించలేదన్నారు. దళిత విద్యార్థి జేమ్స్ పై హత్యాయత్నానికి పాల్పడిన అగ్రకుల విద్యార్థులకు రౌడీ గ్యాంగులకు స్థానిక కూటమి నాయకుల అండ దండాలు ఉన్నాయన్నారు. అగ్రకుల రౌడీ గ్యాంగ్ కి గొడుగు పడుతున్న స్థానిక పచ్చ చొక్కా పోలీసుల వైఖరికి నిరసనగా తాను ఆత్మహత్య చేసుకుంటానని జేమ్స్ ప్రకటించడంతో స్థానిక తిరుపతి దళిత సంఘాల ఆందోళనతో ఎస్పీ స్పందించారన్నారు ఒంగోలులో నల్లమోటు అనే అగ్రకుల రౌడీ షీటర్ మోటా నవీన్ అనే గిరిజన యువకుడి నోట్లో మూత్రం పోసిన ఘటనలో అప్పటి ఒంగోల్ తాలూకా సి ఐ రాంబాబు మరియు ఎస్సై శ్రీనివాసరావును ప్రభుత్వం సస్పెండ్ చేసింది అన్నారు. యూనివర్సిటీలో ర్యాగింగ్ వృకృత రూపం దాల్చి దళిత విద్యార్థి జేమ్స్ పై సాటి అగ్రకుల విద్యార్థులు అంబేద్కర్ జాతి నా కొడకా అంటూ అవమానించడం బయట రౌడీ గ్యాంగులను తీసుకొని వచ్చి కిరాతక దాడి చేయించడం హెచ్చరిల్లుతున్న అగ్రకుల ఫ్యూడలిజం కి నిదర్శనం అన్నారు. దళిత విద్యార్థి జేమ్స్ పై హత్యాయతనం చేయించిన మూత్రం తాగించిన విద్యార్థులపై విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం రాగింగ్ కేస్ నమోదు చేసి కాలేజీ నుంచి డి బార్ చేయాలని అన్నారు రౌడీ గ్యాంగ్ సాయి రూపేష్ చోటా బ్లడ్ గ్యాంగ్ మరియు హత్యాయత్నానికి పాల్పడిన అగ్రకుల విద్యార్థులపై కూడా ఎస్సీ ఎస్టీ అక్ట్ బీఎన్ఎస్ 109 ప్రకారం అరెస్టు చేయాలి అన్నారు. ఆదిపత్య పోరులో ఒంగోలులో హత్యకు గురైన తెలుగుదేశం నాయకుడు వీరయ్య చౌదరి ఘటనలో అర్ధరాత్రి హుటాహుటిన ఒంగోలు వచ్చి పరిస్థితులను సమీక్షించిన హెూమ్ మంత్రి అనిత దళిత విద్యార్థి జేమ్స్ పై హత్యాయతనం జరిపి మూత్రం తాపించిన అనాగరిక అగ్రకుల అమానుషం పై కనీసం ఐజి స్థాయి అధికారి చే విచారణ జరిపించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, రవి, దళిత మహాసభ అధ్యక్షుడు దుగ్గిరాల విజయ్ కుమార్ గిరిజన నాయకులు చింతల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల శారీరక ఆరోగ్యానికి ఆసనాలు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 19)**

జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒంగోలులో ఈ నెల 19వ తేదీ సోమ వారం ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఆధీనంలో తేది.28.04.2025 నుండి తేది.06.06.2025 వరకు జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 18వ రోజు ముందుగా కుమారి ఎస్.సుశీల యోగా క్లాస్‌లో పిల్లల శారీరక ఆరోగ్యం కోసం వివిధ రకాలైన ఆసనాలు వేయించారు. అనంతరం వి.వెంకయ్య మాస్టర్ స్పోకెన్ ఇంగ్లీషు క్లాస్‌లో పార్ట్ ఆఫ్ స్పీచ్ గురించి బోధించారు. అనంతరం జాలాది మోహన్, కవి, వ్యక్తిత్వ వికాసకులు, ఉపాధ్యాయులు పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో మానసిక వికాసం గురించి కొన్ని విషయాలు, మోటివేషన్ కథలు చెప్పటం జరిగింది. ఒంగోలు నగరం నందు ఈ రోజు వర్షం పడుట కారణంగా వేసవి విజ్ఞాన శిబిరంనకు పిల్లలు చాలా తక్కువ సంఖ్యలో రావటం జరిగిందన్నారు. మంగళ వారం నుంచి పిల్లలు వేసవి విజ్ఞాన శిబిరంనకు హాజరు కావాలని ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి తెలిపారు.

# కనిగిరి స్నేహహస్తం ఆధ్వర్యంలో భోజనం వసతి





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 19)**

సోమవారం కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు వారి బంధువులకు, యాచకులకు, మతిస్థిమితం లేని వారికి స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన వసతిని కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరెడ్డి ప్రారంభించారు. స్నేహహస్తం అధ్యక్షులు సుధీర్ బాబు మాట్లాడుతూ వారంలో రెండు రోజులు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే గర్భిణీ మహిళలకు, పేదలకు మా వంతు సహకారం అందిస్తామని, పేదల ఆకలి తీర్చడం ఎంతో సంతోషంగా ఉందని ఇటువంటి సేకార్యక్రమాలకు ఎల్లప్పుడు మా స్నేహ హస్తం అందుబాటులో ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన తిరుపతి రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది శంకర్, స్నేహ హస్తం సభ్యులు కాసిం పీరా, మోహన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో నీతి కథలు





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 19)**

ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులతో నీతి కథలు చదివించి అనంతరం గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి పిల్లల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 10 మంది విద్యార్థులు పాల్గొనున్నట్లు డి కోటేశ్వరరావు తెలియజేశారు.

## చినుకు పడితే చిత్తడే





**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 19)**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శక్తి తుఫాన్ కారణంగా కొండేపిలో కొద్దిపాటి వర్షానికి రోడ్లపై ప్రవహిస్తున్న సైడ్ కాలువలోని మురుగునీరు వర్షానికి నీరు ఎటు వెళ్లే అవకాశాలు లేక రోడ్లపై అడుగు మేర ప్రవహిస్తున్నాయి. గవర్నమెంట్ హాస్పటల్ నుండి సాయిబాబా గుడివాడ సెంటర్ వరకు జెండా చెట్టు సెంటర్ ,ప్రభుత్వ హైస్కూల్ , ప్రధాన రహదారి ముందు మురుగు నీరు ప్రవహిస్తుండంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి సైడు కాలువల్లో పూడిక తీయవలసిందిగా కొండపి ప్రజలు కోరుకుంటున్నారు.

## శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టలో పాల్గొన్న మాదాసి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 19)** మండలంలోని చెరుకూరు గ్రామంలో సోమవారం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి శ్రీ పార్వతి దేవి, ధ్వజస్తంభ, విగ్రహాల



ప్రతిష్ట మరియు పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ పిడిసిసి చైర్మన్ మాదాసి వెంకయ్య ఆయన వెంట మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జున రెడ్డి, మాజీ కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వర రెడ్డి, జేష్ట వేణుగోపాల్, మాల్యాద్రి, మండలంలోని వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## నూతన బస్ సర్వీస్‌ను స్వయంగా నడిపి ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి









**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 19)**

కందుకూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో నందు నూతనంగా కందుకూరు నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంనకు బస్ సర్వీస్‌ను సోమవారం సాయంత్రం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా బస్ సర్వీస్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి ఆర్టీసీ అధికారులు, తెలుగునాడు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థానానికి నడుపుతున్న ఈ నూతన బస్ సర్వీసును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్, ఆర్టీసీ అధికారులు కందుకూరు మండలం పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, తెలుగు నాడు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# తోడేరు అబ్బాయి చాలా బుద్ధిమంతుడంట

### బెయిల్ కోసం ఏకంగా సుప్రీంకోర్టుకే మస్కా కొట్టే యత్నం

### సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 19)**

పొదలకూరు మండలం మరుపూరు పర్యటన సందర్భంగా సోమవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మరుపూరులో నిర్మాణం పూర్తయిన సిమెంట్ రోడ్లకు ప్రారంభోత్సవంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన తోడేరు అబ్బాయి కాకాణి ఖ్యాతి జిల్లా, రాష్ట్రం పరిధి దాటి సుప్రీం కోర్టు స్థాయికి చేరింది. బెయిల్ కోసం ఏకంగా సుప్రీంకోర్టునే తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. తనకు ఎలాంటి నేరచరిత్ర లేదని, ఇప్పటి వరకు తనపై ఎలాంటి కేసులు నమోదు కాలేదని నమ్మించేందుకు యత్నించాడన్నారు. 2024 ఎన్నికల సందర్భంగా ఆయన సమర్పించిన అఫిడవిట్‌ను ప్రభుత్వ న్యాయవాది కోర్టు ముందుంచడంతో అబ్బాయి చరిత్ర చూసి సుప్రీంకోర్టు ఫైర్ అయింది. చివరకు పిటీషన్ విత్ డ్రా చేసుకుంటామని బతిమలాడినా ఒప్పుకోకుండా డిస్మిస్ చేసిందన్నారు. జిల్లా కోర్టు, ఆర్డీఓ ఆఫీసులో ఫైళ్లు లేపేసిన అనుభవంతోనే సుప్రీం కోర్టులోనూ ఒక ట్రయల్ వేసినట్టున్నారు. తోడేరు అబ్బాయి చేసిన పాపాలు ఒకటారెండా..చెప్పుకుంటూ పోతే కొండవీటి చేంతాడంత అని ఎద్దేవా చేశారు. ఇన్ కం ట్యాక్స్ కట్టే కోటీశ్వరులైన రావుల అంకయ్య గౌడ్ కుటుంబానికి మరుపూరులో 57 ఎకరాలు దారాదత్తం చేశారన్నారు. మరుపూరుకి చెందిన మరో నిరుపేద గోపాలరెడ్డికి 27 ఎకరాల భూములను అప్పగిస్తూ రికార్డులు మార్చేశారన్నారు. కాకాణికి సేవ చేశారని ఈ విధంగా రుణం తీర్చుకుంటారా అన్నారు. వైసీపీ పాలనలో తహసీల్దార్లు వీరవసంతరావు, స్వాతి అడ్డంగా సంతకాలు పెట్టేశారన్నారు. గత ఏడాది ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే కొద్ది గంటల ముందే కృష్ణపట్నం పోర్టు రోడ్డులో అల్లుడికి 57 ఎకరాలు సంతర్పణ చేస్తూ అర్ధరాత్రి కాకాణి జీఓ ఇప్పించాడు. ఆ అల్లుడు కూడా నిరుపేదే అన్నారు. మనుబోలు మండలంలో జాతీయ రహదారి పక్కనే 19 ఎకరాలను చెరపట్టారన్నారు. ఒక్క భూములే కాదు గ్రావెల్, ఇసుక, మట్టి, క్వార్ట్జ్ దేనినీ వదిలిపెట్టకుండా దోపిడీకి పాల్పడ్డారన్నారు. వరదాపురంలో క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌తో వందల కోట్లు ఇష్టారాజ్యంగా దోచేశాడన్నారు. నేను మైన్ లోకి వెళ్లి అక్రమ మైనింగ్ విషయాన్ని ఆధారాలతో సహా వెలుగులోకి తెచ్చాను. కలెక్టర్ నుంచి పీఎం వరకూ అందరికీ ఫిర్యాదులు పంపానన్నారు. ఇల్లీగల్ మైనింగ్ ఆపాలని హైకోర్టు కూడా తీర్పు ఇచ్చింది, అయినా లెక్క చేయక క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కొనసాగించారన్నారు. గిరిజనుల ప్రాణాలను ఫణంగా పెట్టి భారీ పేలుళ్లలతో క్వార్ట్జ్ మైనింగ్ చేశారన్నారు.అక్కడి భయానక పరిస్థితులను చూసి అప్పటికప్పుడే సత్యాగ్రహ దీక్ష చేపట్టానన్నారు. అక్రమ మైనింగ్ కు అడ్డుగా నిలిచిన నాపైకి వందల మంది హిజ్రాలను, రౌడీలను ఉసిగొల్పాడన్నారు. ఒక రాజకీయ ప్రత్యర్థి చేస్తున్న పోరాటంపైకి హిజ్రాలను పంపిన ఏకైక వ్యక్తిగా గోవర్ధన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారేమోనన్నారు. 40 ఏళ్లకు పైగా రాజకీయాల్లో ఉన్నా కాకాణిలా దుర్మార్గమైన భాష మాట్లాడే నాయకుడిని ఇప్పటి వరకు చూడలేదన్నారు. వైసీపీ పాలనలో లెక్కకు మించి చేసిన పాపాలే కాకాణి గోవర్ధన్ రెడ్డికి శాపాలుగా మారాయన్నారు.





# పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకై కృషి చేద్దాం

### సిపిఎం నేత జీవీబీ కుమార్




**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 19)**

పీడిత ప్రజల ప్రియతమ నేత, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, సిపిఎం అఖిల భారత ప్రథమ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకై కృషి చేయాలని సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ సిపిఎం శ్రేణులకు పిలుపునిచ్చారు. అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభ ఉలవపాడు మండలం కరేడు రామకృష్ణాపురంలో జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి ఆ పార్టీ సీనియర్ నాయకురాలు కామ్రేడ్ పొన్నం రామలక్ష్మమ్మ పూలమాలవేసి జోహార్లు అర్పించారు. అనంతరం పార్టీ నాయకులందరూ పూలు వేసి సుందరయ్య ఆశయాలను సాధిస్తాం, పుచ్చలపల్లి సుందరయ్యకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి పార్టీ మండల నాయకురాలు కత్తి సుజాత అధ్యక్షత వహించింది. వర్ధంతి సభలో పాల్గొన్న జీవీబీ కుమార్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య సంపన్న కుటుంబంలో పుట్టినా తన పేరు చివర రెడ్డిని తీసివేసి, తాను సంతానం లేకుండా ఆపరేషన్ చేయించుకొని, తన యావదాస్తిని పేద ప్రజలకు పంచిపెట్టి అణగారిన వర్గాల అభ్యున్నతి కృషి చేశాడని పేర్కొన్నారు. తాను భారతదేశానికి మొదటి ప్రతిపక్ష నేతగా ఉండి పార్లమెంట్లో అనేక అంశాలపై అనర్గళంగా మాట్లాడే వారిని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధిగా ఉండి హంగు ఆర్భాటం లేకుండా నిరాడంబరంగా పార్లమెంట్ కు సైకిల్ పై వెళ్ళినాడని అన్నారు. తాను చిన్న వయసులోనే స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్నాడని తెలిపారు. పేద ప్రజలకు కూడు, గుడ్డ, నీడ, చదువు, సమానత్వం కొరకు కృషి చేశాడని తెలిపారు. అంటరానితనం కుల వ్యవస్థకు వ్యతిరేకంగా తాను పుట్టిన గ్రామమైన నెల్లూరు జిల్లా అలగాని పాడు నుండి ఉద్యమం ప్రారంభించాడని తెలిపారు. పాలకవర్గాలు నేడు ప్రజల మధ్య కుల, మత, ప్రాంత వైషమ్యాలు రెచ్చగొడుతున్న నేపథ్యంలో అందరూ కలిసి ఉండాలని సమానత్వం, దోపిడీలేని సోషలిస్టు సమాజం రావాలని తాను కృషి చేశాడని, నేటికీ అది మిగిలిఉన్నదని తెలిపారు. సుందరయ్య గారికి నివాళులర్పించడం అంటే ఆయన కోరుకున్న దోపిడీ లేని సమ సమాజం కోసం కృషి చేయటం, కులవివక్షతకు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడడం ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళులని అందుకోసం సిపిఎం శ్రేణులు కృషి చేయాలని జీవీబీ కుమార్ కోరారు. ఈ వర్ధంతి సభలో సిపిఎం కరేడు రామకృష్ణాపురం శాఖ కార్యదర్శి చేవూరి లోకేష్, సిపిఎం మండల నాయకులు గంజి శ్రీనివాసులు, ఏలూరి నాగార్జున, సిపిఎం పార్టీ సభ్యులు ఎం.అంకమరావు, కత్తి వెంకటేశ్వర్లు, కే అనిల్, కే కోటయ్య, దుర్గా ప్రసాద్, విజయమ్మ అంకమ్మ తదితరులు పాల్గొన్నారు

## ప్రసన్నాంజనేయ సన్నిధిలో ఇంటూరి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఇంటూరి దంపతులు









**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 19)**

బాపట్ల జిల్లా అద్దంకి మండలం శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వద్ద నూతన ధ్వజస్తంభం, ఆలయ కలిశ పునఃప్రతిష్ట, మహా కుంభాభిషేకం కార్యక్రమాలలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ, ఆలయ వేద పండితులు ఇంటూరి దంపతులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన పీఠాధిపతుల వద్ద ఇంటూరి కుటుంబం ప్రత్యేక ఆశీర్వచనాలు తీసుకున్నారు. శింగరకొండ జరుగుతున్న దైవందిత కార్యక్రమాలలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ,పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## డీఈఓ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయండి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 19)**

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సంఘం ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 21వ తేదీన ప్రకాశం జిల్లా డీఈఓ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని మార్కాపురం డివిజన్ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చారు. ప్రధానంగా పాఠశాలల్లో సమాంతర మీడియా ఉండాలని తెలుగు , ఇంగ్లీష్ భాషలలో విద్యాబోధన జరగాలని ఉన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఇవ్వాలని ప్రాథమిక పాఠశాలలో ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ గా ఎస్జీటీ వారితో పదోన్నతి ద్వారా భర్తీ చేయాలని తెలుగు మీడియంలో ఉన్న ఉర్దూ పోస్టును ఉర్దూ మీడియంలో ఉన్న తెలుగును పోస్టులను కొనసాగించాలని వీటిని అంగీకరించని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర నందు జరిగిన సమావేశం నందు ఎస్టియు యుటిఎఫ్ వైఎస్ఆర్టిఏ ఆర్ యూపిపి , ఉద్యమ నాయకులు ఓ.వీరారెడ్డి , ఎస్.కె మౌలాలి ,పాపయ్య, దండా వెంకట్ రెడ్డి, టీవీ రమణ,పిల్లి పోయిన వెంకటేశ్వర్లు ,బట్టగిరి చిన్నారెడ్డి ,ఆర్ పి బి శ్రీనివాస్ ఎం కృష్ణమూర్తి , ఎన్ శ్రీనివాసరెడ్డి ,ఫ్రాన్సిస్ ఎన్ చంద్రశేఖరయ్య ,జయరామిరెడ్డి ,అల్లూరి శ్రీనివాసులు, బివి రాజా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్ కంభం సీఐ, ఎస్ఐ, కానిస్టేబుల్లను అభినందించిన ఎస్పీ, డిఎస్పీ

### పిల్లల కదలికలు తల్లితండ్రులు గుర్తించాలి

### మీడియా సమావేశంలో సిఐ మల్లిఖార్జున

**(షణ్ముఖ వెలుగు, కంభం, మే 19)**

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్. దామోదర్ ఆదేశాల మేరకు డిఎస్పీ యు.నాగరాజు ఆధ్వర్యంలో కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు తన సిబ్బందితో కలిసి గంజాయి తరలిస్తున్న ముగ్గురిని చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంభం పట్టణంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నప్పుడు ముగ్గురు వ్యక్తులు అనుమానస్పద రీతిలో ఆటో దిగి నడుచుకుంటూ వెళుతుండగా వారి కదలికలను అనుమానించిన పోలీసులు అదుపులో తీసుకొని విచారించగా ముద్దాయిలు వైజాగ్ కి చెందిన ఓ వ్యక్తి నుండి కొందరు గంజాయికి అలవాటు పడి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి దానిని కంభం, బెస్తవారిపేట చుట్టుపక్కల ప్రాంతాలలో అమ్ముకొని ఎక్కువ లాభాలు పొందాలన్న ఆశతో పతకం వేసి 14-5-2025 తేదీన మోక్షగుండం గ్రామంలోని ముక్తేశ్వరం గుడి వద్దనున్న ఓ వ్యక్తి దగ్గరికి గంజాయి వార్త తీసుకొని రాగా ఆ వ్యక్తి మిగతా ఇద్దరు వ్యక్తులకు సమాచారం ఇవ్వగా ముగ్గురు కలిసి ఒక కేజీ గంజాయి 8000 ప్రకారం కొనుగోలు చేసి అదే ఊరిలో ప్యాకెట్లు తయారు చేసి అమ్మితే గ్రామస్తులు ఎవరైనా చుస్తే చెడ్డపేరు వస్తుంది పైగా పోలీసులకు సమాచారం ఇస్తారని భావించి ముగ్గురు కలిసి గంజాయిని కంభం తీసుకొని వచ్చి అక్కడ ఒక టిఫిన్, కిరాణా షాపులో చిన్న చిన్న ప్లాస్టిక్ కవర్లు కొనుగోలు చేసి అక్కడ నుండి రావిపాడు గ్రామం వైపు వెళ్లి అక్కడ ఎక్కడైనా పంట పొలాలలో చెట్ల కింద గంజాయిని ప్యాకెట్లలో నింపి వాటిని అమ్ముకుందామని అనుకుని రావిపాడు నుండి కంభం కి ఇద్దరు వెళుతుండగా అక్కడే వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 2.150కేజీల గంజాయి ఉన్నట్లు తెలుసుకొని కంభం ఎంఆర్వో సమక్షంలో వారి వద్దనున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి రవాణాను నిర్మూలించాలి అని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్ణయం తీసుకున్న వేళ ఎంతో చాకచక్యంగా వ్యవహరించి గంజాయి ముద్దాయిలను 19-5-2025 తేదీన అరెస్ట్ చేసిన కంభం సీఐ మల్లికార్జున, ఎస్ఐ నరసింహారావు, సిబ్బంది రమేష్, పీరయ్య, శివయ్య, లాజర్ అనే కానిస్టేబుల్లను జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్, డిఎస్పీ యు నాగరాజు అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మల్లికార్జున, ఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ పిల్లల కదలికలను తల్లితండ్రులు గమనించాలని ఇలాంటి చెడు అలవాట్ల వలన భవిష్యత్తు పాడవుతుందని, చెడు వ్యసనాలకు అలవాటు పడి మీ బంగారు భవిష్యత్తు పాడుచేసుకోవద్దని యువతను కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే సహించేది లేదని చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని వివరాలు అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు.






# ప్రజలే దేవుళ్లుగా పనిచేస్తున్న ఏకైక రాజకీయపార్టీ తెలుగుదేశం



**తెదేపా నేతలు**

**వినుకొండలో ఘనంగా నియోజకవర్గస్థాయి మహానాడు**

**మహానాడులో పాల్గొన్న తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ లావు, చీఫ్ విప్ జీవీ, ఎమ్మెల్సీ ఆలపాటి, డీసీసీబీ చైర్మన్ మక్కెన, కొమ్మాలపాటి శ్రీధర్**







(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 19)

దేశంలోనే ప్రజలే దేవుళ్లుగా పనిచేస్తున్న ఏకైక రాజకీయపార్టీ తెలుగుదేశం మాత్రమే అంటూ ముక్తకంఠంతో నినదించారు పల్నాడు జిల్లా ముఖ్యనాయకులంతా. పేదవాడికి పట్టెడన్నం, ఆత్మ గౌరవం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ఎన్టీఆర్ ఏ ఆశయాలతో పార్టీని ప్రారంభించారో, వాటినే ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు తీసుకుని వెళ్తున్నారని తెలిపారు. ఈ నెల 27 నుంచి కడప వేదికగా జరగబోతున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకి సన్నాహకంగా సోమవారం వినుకొండలో నియోజకవర్గ స్థాయి మహానాడును నిర్వహించారు. గడిచిన ఏడాది సాగించిన పోరాటాలు, సాధించిన విజయాలు గుర్తుచేసుకుంటునే రానున్న ఏడాదికి సన్నద్ధం కావడానికి ఈ సందర్భాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వినుకొండలో ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి మహానాడు నిర్వహించారు. తిమ్మాయపాలెం రోడ్డులోని వై కన్వెన్షన్ హాలులో నియోజకవర్గ స్థాయి మహానాడు సోమవారం ఘనంగా జరిగింది. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం తెదేపా వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో అంతా కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. 27 నుంచి 29వ తేదీ వరకు కడపలో జరగనున్న రాష్ట్ర మహానాడును విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఐదేళ్ల పాటు రాక్షస పాలనకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన పోరాడిన మన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని.. కాస్త ఓపిక పట్టాలని పేర్కొన్నారు. తెదేపా పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిందని, ప్రజల సంక్షేమం ఓ వైపు.. రాష్ట్ర అభివృద్ధి మరోవైపుతో తనదైన ముద్ర వేసుకుంటుందని అభిప్రాయపడ్డారు నేతలు. రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారని అలాగే నియోజకవర్గంలోనూ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, సైనికుల్లా పనిచేయాలని జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. పలు తీర్మానాలపై చర్చించి నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఎన్టీఆర్ కు భారతరత్న, వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం, అగ్రికల్చర్, వెటర్నరీ కళాశాలల ఏర్పాటు, లెదర్ పార్కు, బొల్లాపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులందరికీ బోర్లు, ఎస్టీ గిరిజన ఆశ్రమ పాఠశాల మంజూరు, పి.ఎం.జి.ఎస్.వై. పథకం కింద మైనర్ ఇరిగేషన్ చెరువులను ఆర్ఆర్ఆర్ పథకం కింద అభివృద్ధి చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా మొదట మాట్లాడిన తెలుగుదేశం పార్టీ లోక్‌సభా పక్ష నాయకుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎన్టీఆర్ హయాం నుంచి తెలుగుదేశం పార్టీ అంటే అభివృ ద్ధి, సంక్షేమానికి పర్యాయపదంగా నిలిచిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా అదే స్ఫూర్తిని ముందుకు తీసుకుని వెళ్లాలని సూచించారు. భవిష్యత్‌లోనూ ఆ పేరు నిలబెట్టాలన్నారు. వ్యక్తిగతంగా మనకేం కావాలి అన్నదానికంటే మన ఊరికి, ప్రాంతానికి అవసరమైన వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. కేంద్రపథకాలు సద్వినియోగం చేసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఉన్న రాయితీలను ఉపయోగించు కోవాలన్నారు. అనంతరం చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సమాజంలో వెనకబడిన వర్గాల అభ్యున్నతి కోసం పెట్టిన పార్టీ తెలుగుదేశంలో ఉన్నందుకు ప్రతిఒక్కరు ఎంతో గర్వపడాలన్నారు. మహిళలకు ఆస్తిహక్కు, రూ.2కే కిలోబియ్యం వంటి కార్యక్రమాల ద్వారా ఎన్టీఆర్ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్నమాటకు నిజమైన అర్థం చెప్పారన్నారు. తెలుగునాట బీసీలకు రిజర్వే షన్లు కల్పించి వారి రాజకీయ చైతన్యం, నాయకత్వానికి బాటలు వేసింది ఎన్టీఆర్, చంద్రబాబే అన్నారు. ఎన్టీఆర్ ఏ ఆశయాలైతే సాధించాలని అనుకున్నాదే అదే దిశగా పార్టీని చంద్రబాబు నడిపిస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం ఈ దఫా ప్రభుత్వంలో బీసీల రక్షణకు ప్రత్యేకచట్టం చేసిన చంద్రబాబు పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు. రాష్ట్రంలో పేదల పింఛన్ రూ.4వేలు చేసిన ఘనత తెలుగుదేశం, చంద్రబాబుకే చెందుతుందన్నారు. ఇలాంటి తరుణంలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగానే జరగబోతున్న కడప మహానాడుకు పెద్దఎత్తున స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మాట్లాడిన పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ తెలుగునాట రాజకీయ చైతన్యం, అన్నివర్గాలకు అధికారం తెలుగుదేశం పార్టీ ద్వారానే సాకారమైందన్నారు. అలాంటి చైతన్యవంతమైన పార్టీలో ఉన్నవారంతా అదే విలువలతో పనిచేస్తున్నారన్నారు. లక్ష్యాలు పెట్టుకోవాలి. వాటి చేరుకునే ప్రణాళికలు ఉండాలి. మహానాడు ద్వారా అందుకు అవకాశం చిక్కుతుంది. మహానాడు ద్వారా తీసుకునే నిర్ణయాలు పార్టీ, రాష్ట్ర అబివృద్ధికి ఉపయోగ పడతాయన్నారు. కష్టపడినవారికి ఎప్పు డూ పార్టీలో మంచి స్థానం లభిస్తుందన్నారు. ఏ స్థాయికి చేరినా ఎప్పుడూ పార్టీకి విధేయులై ఉండా లన్నారు. సామాజిక న్యాయానికి ఎప్పుడూ పార్టీ అధిష్ఠానం పెద్దపీట వేస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్నో కష్టాలు దాటుకుని వచ్చిందని, ఎప్పుడూ ప్రజల్లో ఉండాలనేదే సీఎం చంద్రబాబు సంకల్పమమన్నారు. జగన్ రెడ్డి తెదేపానే లేకుండా చేయాలని చూశారని, ఈరోజు వైకాపా ఉంటుందో లేదో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి ఒక్క హామీ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వైసీపీ నేతలు హామీల అమలుపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా వైసీపీ నేతలు చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మానుకొండ శివప్రసాద్, గంగాధర్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పండగలా సాగిన సర్వేపల్లి మహానాడు

**భారీగా తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు**

**జనసంద్రంగా మారిన శ్రిడ్స్ కళ్యాణ మండపం ప్రాంగణం**

**ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి మహానాడుకు శ్రీకారం**







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 19)

చెముడుగుంటలోని శ్రిడ్స్ కళ్యాణమండపం ప్రాంగణంలో నిర్వహించిన సర్వేపల్లి మహానాడు పండుగలా సాగింది. సోమవారం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి మహానాడుకు శ్రీకారం చుట్టారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మహానాడుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు, పోలంరెడ్డి దినేష్ రెడ్డి, డాక్టర్ జెడ్. శివప్రసాద్, పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, దావా పెంచలరావు, జెన్ని రమణయ్య తదితరులు హాజరయ్యారు. నియోజకవర్గ నలుమూలల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. వెంకటాచలం మండలం చెముడుగుంటలోని శ్రిడ్స్ కళ్యాణమండపం ప్రాంగణం మొత్తం జనసంద్రంగా మారింది.

## దళిత విద్యార్థి జేమ్స్ పై దాడిని ఖండించిన వైసీపీ







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 19)

తీవ్రంగా గాయపడి నెల్లూరు షైన్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న తిరుపతికి చెందిన దళిత విద్యార్థి జేమ్స్‌ను జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున , విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి పరామర్శించారు. అనంతరం నెల్లూరు వీఆర్సి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి.. జేమ్స్ పై దాడిని వ్యతిరేకిస్తూ నిరసన.. తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి.. ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్ఆర్సిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు ఆశ్రిత రెడ్డిలు అన్నారు. జేమ్స్ పై దాడిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అత్యంత పాశవికంగా దళిత విద్యార్థి జేమ్స్ పై దాడి జరిగిందని.. ఇది ఒక అమానుష చర్య అన్నారు. దాడుల సంస్కృతి మంచిది కాదని.. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా.. ప్రజలకు ప్రభుత్వం భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ 11 నెలల పాలనలో ప్రజలపై దాడులు దౌర్జన్యాలే తప్ప అభివృద్ధి, సంక్షేమం శూన్యమన్నారు. ఎప్పుడు ఎవరి మీద ఏ పక్క నుంచి దాడి జరుగుతుందా అన్న.. అభద్రతాభావంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే.. వైసీపీ ప్రజల పక్షాన నిలిచి ఉద్యమ బాట పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

## హనుమాన్ ర్యాలీ అడ్డుకోవడం పై బీజేపీ ఖండన

**బిజెపి నేత మిడతల రమేష్**



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 19)

హనుమాన్ ర్యాలీ అడ్డుకోవడం, మెడలో కాషాయ కండువాలును పట్టి లాగడం, పోలీసుల లాఠీచార్జి వంటి చర్యలను బిజెపి నేత మిడతల రమేష్ ఖండించారు. మదనపల్లిలో శనివారం నిర్వహించిన హనుమాన్ ర్యాలీలో హిందూ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేశారు. అవసరం లేకుండా లాటిచార్జి చేసి హిందువుల ర్యాలీనీ అడ్డుకున్నారు. హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహించాలనడం దేశ చరిత్రలోనే ఆశ్చర్యకరమైన పోలీసుల నిబంధన అన్నారు. పోలీసులు ఆంక్షలు విధించిన మార్గానికి 3 కిలోమీటర్లముందు ర్యాలీని ఆపేసారు. పోలీస్ ఆజ్ఞలను ఉల్లంఘించారని కేసు ఎలా పెట్టారో రాష్ట్ర హోంమంత్రి హిందువులకు జవాబు చెప్పాలని రమేష్ డిమాండ్ చేశారు. మెడలో కాషాయ కండువాలు లాగేసి. మహిళల మీద దురుసుగా ప్రవర్తించడం భక్తులను లాఠీలతో తరుముకుంటూ పోవడం ఎవరో మెప్పుకోసం చేసినట్లు ఉందన్నారు. హిందువులు ర్యాలీ ఎలా చేసుకోవాలో పోలీసులే నిర్దేశించడం హిందూ సమాజాన్ని అవమానపర్చడమే .. హనుమాన్ ర్యాలీ పై మదనపల్లి పోలీసుల వైఖరి హిందువుల మనోభావాలను దెబ్బతిస్తుందన్నారు. ఇటువంటి సంఘటనలు చూస్తుంటే ఈ రాష్ట్రంలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

## ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా తెదేపా కార్యకర్తల సంక్షేమ నిధి

**ఇద్దరి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున బీమా చెక్కు అందజేత**

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 19)

దేశంలోనే మరే రాజకీయ పార్టీకి లేనివిధంగా తెలుగుదేశానికి మాత్రమే కార్యకర్తల సంక్షేమనిధి ఉందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రాణాలు పణంగా పెట్టి పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను కుటుంబంగా భావించే సంస్కృతి తెలుగుదేశం సొంతమ న్నారు. పార్టీ అధిష్ఠానంతో పాటు నాయకులంతా కూడా వారికి అండగా ఉంటారన్నారు. ఇటీవల ప్రమాదంలో మరణించిన కార్యకర్తల కుటుంబాలకు సోమవారం రూ.5 లక్షల చొప్పున బీమా చెక్కులను చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అందజేశారు. వినుకొండ మండలం చీకటీగలపాలేనికి చెందిన అన్నెం బ్రహ్మారెడ్డి, బొల్లాపల్లి మండలం రేమిడిచర్లకు చెందిన ఖాసింసా ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం చెందారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు జీవీ ఆంజనేయులు బీమా చెక్కులను అందించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కార్యకర్తలకు ఏం కష్టం వచ్చినా కుటుంబ పెద్దల్లా ఆదుకుంటున్నారి అన్నారు. వ్యక్తిగత శ్రద్ధతో పాటు వ్యవస్థాగతంగా కార్యకర్తలకు భరోసా ఉండాలనే బీమా సదుపాయం కూడా ఏర్పా చేశారన్న జీవీ ఏటా ఆ ప్రీమియం మొత్తం పార్టీనే చెల్లిస్తుందని చెప్పారు. కార్యకర్తల సంక్షేమనిధి సారథిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టాక ఇలాంటి పలు విప్లవాత్మక నిర్ణయాల్ని తీసుకున్నారని తెలిపారు. కోటి మంది కార్యకర్తలకు ఒకేసారి బీమా కల్పించడం రాజకీయ పార్టీల చరిత్రలో ఇదే ప్రథమం' అని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదంలో కార్యకర్త మరణిస్తే 15 రోజుల్లో ఆ సమాచారాన్ని తెలపాలని, 30 రోజుల్లో ధ్రువపత్రాలు తీసుకొని నామినీ స్వయంగా వినుకొండలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పార్టీ సభ్యత్వం తీసుకొన్న కార్యకర్త ప్రమాదంలో మరణిస్తే కుటుంబానికి రూ.5 లక్షలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మానుకొండ శివప్రసాద్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.







## వైభవంగా నల్లం వారి, బట్టు వారి నిశ్చయ తాంబూలాల వేడుక

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 19)

నల్లం సునీల్ లీలావతి కుమార్తె సాయి రూప శ్రీ, సిరుగుప్ప వాస్తవ్యులు బట్టు నాగరాజు ప్రసన్న దంపతుల కుమారుడు బట్టు నవీన్‌ల నిశ్చయ తాంబూలా వేడుకలు పొదిలి పట్టణంలో నల్లం సునీల్ స్వగృహం నందు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి గాండ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చిట్టెం శెట్టి వెంకట కృష్ణారావు, దాసరి గురుస్వామి ఏరువ వెంకటరామయ్య, దుడ్డు హరి, శివయ్య, బుదాటి సత్యనారాయణ, అజయ్ సాయికుమార్, వందలాది బంధుమిత్రులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి విచ్చేసిన బంధుమిత్రులు పెద్దలందరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

# త్రిపురాంతకం వైస్ ఎంపీపీగా పాటిబండ్ల కృష్ణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 19)

త్రిపురాంతకం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎన్నికల్లో మేడపి ఎంపీటీసీ సభ్యుడు పాటిబండ్ల కృష్ణ( వైసీపీ) త్రిపురాంతకం వైస్ ఎంపీపీగా ఏకగ్రీవ ఎన్నికయ్యారు. మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎన్నికను దగ్గర ఉండి యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

# రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా సీఐ భీమానాయక్ సమావేశం







(షణ్ముఖ వెలుగు, కనిగిరి ఇన్‌ఛార్జి, మే 19)

పామూరు సర్కిల్ పరిధిలోని సిఎస్‌పురం పట్టణంలో ఈ నెల 30 నుంచి జూన్ 5వ తేదీ వరకు వైభవంగా జరిగే రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా పట్టణంలోని వివిధ సామాజిక వర్గాల నాయకులతో, ఆలయ కమిటీ సభ్యులతో, గ్రామస్తులతో ప్రత్యేకంగా పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం భీమా నాయక్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరునాళ్ల వేడుకల్లో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా సంతోషకరమైన వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ పురం సబ్ ఇన్స్పెక్టర్ సుమన్ , గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

# కొండపిలో తిరంగా ర్యాలీ

## ర్యాలీలో పాల్గొన్న మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 19)

పహల్గాం ఉగ్రదాడి అనంతరం జరిగిన యుద్ధంలో భారత సైనికులు చూపిన పోరాట స్ఫూర్తికి యావత్ దేశం గర్విస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా సోమవారం ప్రకాశం జిల్లా కొండపిలో ప్రభుత్వ భవన కాంప్లెక్స్ నుంచి సీతారామ కళ్యాణ మండపం వరకు భారీ జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ....ఉగ్రవాదం ప్రపంచానికి పెను విపత్తు, ఉగ్రవాదాన్ని అణచివేయాల్సిందే. పహల్గంలో మన దేశ పౌరులపై జరిగిన ఉగ్రదాడికి బదులుగా ప్రధాని మోడీ నాయకత్వంలో ఆపరేషన్ సింధూర్ ని భారత సైన్యం విజయవంతంగా పూర్తి చేసింది. యుద్ధంలో మన దేశ సైనికులు చూపిన పోరాట స్ఫూర్తికి యావత్ దేశం మొత్తం గర్విస్తోంది. యుద్ధంలో మరణించిన అనంతపురం జిల్లాకు చెందిన వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలిచిందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# మాచర్లలో పసుపు జెండా రెపరెపలు

# దిగ్విజయంగా నియోజకవర్గ మహానాడు

## సంక్షేమ దార్శనీకులు ఎన్టీఆర్‌కు ఘన నివాళులు
## దేశ రాజకీయాల్లో ప్రభంజనం టిడిపి
## మంత్రి గొట్టిపాటి రవికుమార్



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 19)

తెలుగుదేశం పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి దేశ రాజకీయాల్లో సంచలనాలను సృష్టించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు కే చెల్లుతుందని పల్నాడు జిల్లా ఇంచార్జ్ మంత్రి వర్యులు గొట్టిపాటి రవికుమార్ పునరుద్ఘాటించారు. మాచర్ల పట్టణం మానుకొండ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ "మహానాడు" కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పుర వీధులన్నీ పసుపు జెండాలు రెపరెపలాడాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్టీ జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ బాబు, శాప్ చైర్మన్ రవి నాయుడు, శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన అతిరథ మహారథులకు పార్టీ శ్రేణులు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు., స్థానిక పార్క్ సెంటర్ నుంచి మానుకొండ కళ్యాణమండపం వరకు భారీ ర్యాలీ తీశారు. మహానాడు వేదిక పైన తెలుగుజాతి ఆత్మగౌరవం, టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి ముఖ్య అతిథులు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాచర్ల నియోజకవర్గం ప్రగతి కోసం పది తీర్మాణాలను మాచర్ల శాసన సభ్యులు జూలకంటి



బ్రహ్మానందరెడ్డి ప్రవేశపెట్టి, లక్ష్యాలను క్యాడర్‌కు నిర్దేశించారు.

**సంక్షేమం, అభివృద్ధికి బాటలు**

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి బాటలు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి రవికుమార్ వెల్లడించారు.అన్న ఎన్టీఆర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని తెలుగుదేశం పార్టీ కీర్తిని చంద్రబాబు ప్రపంచ నలు దిశల వ్యాప్తి చేస్తున్నారని కొనియాడారు. యువ నాయకులు నారా లోకేష్ తండ్రి బాటలో నడుస్తూ కార్యకర్తల సంక్షేమ కోసం పాటుపడుతున్నారని చెప్పారు. సాగు, తాగు నీరు ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, ప్రజలకు చంద్రబాబు కచ్చితంగా సుపరిపాలన అందిస్తారని వివరించారు.

ప్రగతి, పథకాలు ఏవి ఆగవు...ఎంపీ లావు

ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో ప్రగతి, పథకాలు ఆగవని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. లక్ష్యాల నిర్దేశానికే మహానాడు కార్యక్రమం అని, సాగునీరు, మౌలిక రంగ ప్రాజెక్టులపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఎన్నికల ముందు మాచర్ల నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగర వేసి, బ్రహ్మారెడ్డిని గెలిపించుకునేందుకు కేడర్ పోలింగ్ బూత్ లో యుద్ధం చేసిందని గుర్తు చేశారు. సామాజిక న్యాయం తెలుగుదేశం పార్టీతోనే జరుగుతుందని వివరించారు. కష్టపడిన కార్యకర్తకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు.

**నియోజకవర్గ ప్రగతికి పది తీర్మానాలు**
**ఎమ్మెల్యే జూలకంటి**

మాచర్ల నియోజకవర్గ ప్రగతికి మహానాడు వేదిక పది తీర్మానాలు చేశామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. కూడు, గూడు, గుడ్డ నినాదంతో పార్టీని అధికారం తీసుకొచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సంక్షేమానికి పెద్దపీఠ వేసారని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఇంటికి తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందించే వరకు విశ్రమించినని హామీ ఇచ్చారు. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కడపలో ఈ నెల 27, 28, 29 న మహానాడు నిర్వహిస్తున్నారని, ఇదే ఉత్సాహంతో పెద్ద ఎత్తు నియోజకవర్గం నుంచి తరలివెళ్ళి పసుపు పండుగా మహానాడును జయప్రదం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమ్మలపాటి శ్రీధర్ బాబు, శాప్ చైర్మన్ రవి నాయుడు, శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ చైర్మన్ ఎం ధారు నాయక్, మాచర్ల మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రసన్నాంజనేయ స్వామి మహా కుంభాభిషేకంలో పాల్గొన్న మంత్రులు గొట్టిపాటి, డోలా

## స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి గొట్టిపాటి
## మంత్రి గొట్టిపాటి రవి చేతుల మీదుగా సింగరకొండ క్షేత్ర వైభవం పుస్తకావిష్కరణ











(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 19)

అద్దంకి నియోజకవర్గంలోని సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన నూతన ధ్వజస్తంభ స్థాపన, మహా కుంభాభిషేకం కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్‌తో పాటు సాంఘిక సంక్షేమ శాఖ డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఇంటూరి నాగేశ్వరరావులు పాల్గొన్నారు. మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తొలుత ఆలయం వద్దకు చేరుకోగా స్థానిక అధికారులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి గొట్టిపాటి స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యంత వైభవోపేతంగా జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా 1700 మందికై పైగా ముత్తైదువులు ప్రకాశం జిల్లా వరప్రదాయిని అయిన గుండ్లకమ్మ నది నుంచి గంగా జలాన్ని సేకరించి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న స్వామి ఆలయాన్ని తిరిగి నిర్మించినట్లు తెలిపారు. నేడు జీవ ప్రతిష్ఠ చేసినట్లు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా నుంచే కాకుండా చుట్టు ప్రక్కల జిల్లాల నుంచి సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వారిని దర్శనం చేసుకునేందుకు భక్తులు వస్తుంటారని చెప్పారు. రానున్న రోజుల్లో సింగరకొండను మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక భక్తుడు రాసిన 'సింగరకొండ క్షేత్ర వైభవం' పుస్తకాన్ని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆవిష్కరించారు.

# భక్తులకు అన్నదానం నిర్వహించిన ఆకుపాటి





(షణ్ముఖ వెలుగు, కనిగిరి ఇన్‌ఛార్జి, మే 19)

హనుమంతునిపాడు మండలంలోని నందనవనంగ్రామం లో శ్రీశ్రీశ్రీ నాగ పరివార సమేత పోలేరమ్మ తల్లి తిరుణాల సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు ఆకుపాటి రమణయ్య కుటుంబ సభ్యులు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ ,పెంచికల రామకృష్ణ , ఆకుపాటి శ్రీనువాసులు, కావేటి సత్యం, కుల్లూరి సుబ్బారావు దేవస్థాన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ భవనం లేకపోవడం బాధాకరం

## ఇన్‌ఛార్జి ఆర్డీఓకు వినతిపత్రం అందించిన మున్సిపల్ ఛైర్మన్ గఫార్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 19)



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భవనం కనిగిరిలో ఇంతవరకు లేకపోవడం చాలా బాధాకరమని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. సోమవారం కనిగిరి రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో కనిగిరి రెవిన్యూ డివిజనల్ ఇంచార్జి ఆర్డిఓ వెంకట శివరామి రెడ్డికి కనిగిరిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం కొరకు స్థల పరిశీలన చేయుటకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి ఆర్డీవో సానుకూలంగాను స్పందించి ఉన్నత అధికారులు దృష్ట్యా త్వరితగతిన స్థల పరిశీలన చేయుటకు చర్యలు చేపడతామని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి పట్టణంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలతో దాదాపుగా 50 శాతం పైచిలుకు కలరు.కనిగిరి డివిజనల్ హెడ్ క్వార్టర్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం నిర్మించుటకు స్థలం కొరకు చాలా మార్లు అధికారులకు సంప్రదించాం, ఇంత వరకు ఎలాంటి ఫలితం లేదు. కనిగిరిలో ఎస్సీ ,ఎస్టీ ,బీసీ ,మైనార్టీలకు ఎలాంటి కమ్యూనిటీ హాలు లేదు. కనిగిరి ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తప్పనిసరిగా అంబేద్కర్ భవనం చాలా అవసరమని ఆయన తెలియజేశారు. చైర్మన్‌తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు,కో ఆప్షన్ సభ్యులు ఖాసీంసా,పులి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com